ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 29 జూలై 2025



కార్పొరేషన్‌లో అవినీతి కంపు

కడప కార్పొరేషన్‌లోని కొన్ని విభాగాల్లో అవినీతి సింహాలు బుసలు కొడుతున్నాయి. నోట్ల కట్టలకు రుచి మరగడంతో అడ్డగోలుగా అక్రమాలకు తెరలేపారని చెబుతారు. టౌన్‌ప్లానింగ్‌లో ఓ అవినీతి అధికారి తన హస్తలాఘవం ప్రదర్శిస్తుండగా, ఇప్పుడు శానిటేషన్ విభాగమూ అవినీతి కంపుగా మారిపోవడం తీవ్ర దుమారం రేపుతోంది. ఆ విభాగంలో ఓ అధికారి కొందరితో కుమ్మక్కై అక్రమాలకు తెరలేపారనే విమర్శలున్నాయి. ఎంతగా అంటే చంద్రబాబు సర్కారు చెత్త పన్ను రద్దు చేసినా కొన్నిచోట్ల నెలకు రూ.50 లక్షల చొప్పున నిరాటంకంగా వసూలు చేస్తుండడం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.

- కార్పొరేషన్‌లో చెత్త పన్ను రద్దు
- అయినా యథేచ్ఛగా వసూలు చేస్తున్న వైనం
- శానిటేషన్‌లో 30 మంది ప్రమేయం
- నెలకు రూ.50 లక్షల చొప్పున రూ.6 కోట్లు వసూళ్లు

(కడప-ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్‌లో కొన్ని విభాగాలు అవినీతికి కేరాఫ్‌గా మారాయి. కూటమి సర్కారు చెత్తపన్ను రద్దు చేసినా కార్పొరేషన్‌లో నిరాఘాటంగా వసూలు చేస్తుండడం గమనార్హం. ఒక నెలో రెండు నెలలో వసూలు చేశారంటే ఏదో అనుకోవచ్చు.. దాదాపు ఏడాది పాటు అడ్డగోలుగా చెత్తపన్ను వసూలుచేసి జేబులు నింపుకున్నారు. ఐదు, పది కాదు.. నెలకు రూ.50లక్షల చొప్పున దాదాపు రూ.6 కోట్ల మేర వసూలు చేసినట్లు ప్రచారం ఉంది. అడ్డగోలుగా చెత్త పన్ను వసూలు చేస్తున్నా అటు పాలకవర్గం కానీ, ఇటు అధికారులు కానీ నోరు మెదపకపోవడం చూస్తే.. అక్రమ వసూళ్లలో వీరికి కూడా భాగం ఉందా అన్న చర్చ నడుస్తోంది. ఈ వ్యవహారంలో కార్పొరేషన్‌కు సంబంధించి సుమారు 30 మంది ప్రమేయం ఉన్నట్లు చెబుతున్నారు.

చెత్తపన్ను ఆపేసి ఏడాది

జగన్ హయాంలో చెత్తపన్ను ప్రవేశపెట్టారు. ఒక్కో ఇంటి నుంచి రూ.90 వసూలు చేయగా.. హాస్పిటళ్లు, హోటల్స్, రెస్టారెంట్లు, బార్‌లు, లాడ్జిలు, సినిమా థియేటర్లు, ఫంక్షన్‌హాల్స్, షాపింగ్‌మాల్స్, చికెన్ మటన్ సెంటర్లు, కూరగాయలు, టీ అంగళ్లు, టిఫిన్ సెంటర్లు, కూల్‌డ్రింక్ షాపులు.. ఇలా స్థాయిని బట్టి నెలకు రూ.200 నుంచి రూ.3వేల దాకా వసూలు చేసేవారు. వైసీపీ హయాంలో చెత్త పన్ను వసూళ్లు పెద్ద విమర్శలకు తావిచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చెత్త పన్ను రద్దు చేస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో ప్రకటించారు. ఈ మేరకు గత ఏడాది జూన్ 9 నుంచి చెత్త పన్ను వసూళ్లు నిలిపివేశారు.

అడ్డగోలుగా వసూళ్లు

జగన్‌హయాంలో దాదాపు నాలుగేళ్ల పాటు చెత్తపన్ను వేశారు. చెల్లించకుంటే అప్పట్లో సచివాలయ ఉద్యోగులు గుంపులుగా వెళ్లి నానా హంగామా చేసేవారు. దీంతో ఎందుకులే అని అనుకుని చెల్లించారు. గత ఏడాది జూన్ 9వ తేదీ నుంచి చెత్తపన్ను రద్దు చేయడంతో.. ఇళ్ల జోలికి వెళ్లకుండా అపార్ట్‌మెంట్లు, బార్లు, హోటల్స్ హాస్పిటల్స్ ఇతర కమర్షియల్‌కు సంబంధించిన అన్నిభవనాల నుంచి వసూలు చేస్తున్నారు. నెలకు సుమారు రూ.50లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. చెత్త పన్ను రద్దు చేశారు కదా అని ఎవరైనా అడిగితే ఇండివిడ్యువల్ ఇళ్లకు రద్దు చేశారని, అపార్ట్‌మెంట్స్, ఇతర కమర్షియల్ సంస్థలకు నిలిపివేయలేదని చెప్పి వసూలు చేయడం విశేషం. చెత్త పన్ను వసూళ్ల బహిర్గతం కావడంతో కమిషనర్ మనోజ్‌రెడ్డి విచారణ చేయించగా.. కళ్లు చెదిరే విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. శానిటేషన్‌లో కొందరు అధికారులు, సచివాలయ సిబ్బంది, మేస్త్రీలు ఇలా మొత్తం 30 మందికి ఈ వసూళ్లలో భాగస్వామ్యం ఉన్నట్లు తేలిందని చెబుతారు. ఈ వ్యవహారంపై కడప కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. చెత్తపన్ను వసూళ్లపై విచారణ జరుపుతున్నామని, త్వరలో వివరాలు వెల్లడిస్తామని అన్నారు.



చెత్త పన్నుకు ఇచ్చిన రశీదు



8 మందిపై వేటు

కడప కార్పొరేషన్‌లోని శానిటేషన్ విభాగంలో అక్రమంగా చెత్త పన్ను వసూలు చేస్తున్న 8 మందిపై కమిషనర్ మనోజ్‌రెడ్డి వేటు వేశారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసరు చంద్రశేఖర్‌ను ప్రభుత్వానికి సరెండరు చేసినట్లు సమాచారం. ఈస్ట్‌జోన్ శానిటరి ఇన్‌స్పెక్టర్ ఈరమయ్య, వెస్ట్‌జోన్ పద్మావతినగర్ 3వ డివిజనులోని సచివాలయం ఉద్యోగి సీ.వెంకటసుబ్బయ్య, ఉక్కాయపల్లెకు చెందిన పబ్లిక్ హెల్త్ మేస్త్రీ శ్రీకాంత్‌ను సస్పెండ్ చేశారు. ఇక ఆప్కాబ్ సిబ్బంది అయిన 21వ డివిజనులోని 2వ సచివాలయం వి.రవికుమార్, 13వ డివిజనులో 2వ సచివాలయం సి.మల్లికార్జునరెడ్డి, ఈస్ట్‌జోన్ జి.ఓబులేసు, వర్కర్ జి.విక్రంకుమార్‌ను విధుల నుంచి తొలగించారు. ఇప్పుడు ఈ వ్యవహారం కార్పొరేషనులో దుమారం రేపుతోంది. ప్రభుత్వం చెత్త పన్ను నిలిపివేసినా అక్రమంగా వసూలు చేశారు. దీనిపై కమిషనర్‌కు ఫిర్యాదు రావడంతో విచారణ చేపట్టారు. విచారణ కొనసాగుతుందని కమిషనర్ అన్నారు. భవిష్యత్తులో అలాంటివి జరగకుండా ప్రత్యేక టీంను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారాలు ఉండాలి : కలెక్టర్

కడప కలెక్టరేట్, జూలై 28(ఆంధ్రజ్యోతి): అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారాలు అందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున అర్జీదారులు పాల్గొని అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదు దారుల విజ్ఞప్తులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి స్వయంగా వెళ్లి పారదర్శకంగా విచారణ జరిపి న్యాయం చేయాలన్నారు అర్జీదారుడు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగకుండా నిర్ణీత గడువులోగా తప్పని సరిగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, జడ్పీ సీఈవో రాములమ్మ, ఎస్డీసీ వెంకటపతి, జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్‌బాబు, వ్యవసాయ శాఖ జేడీ చంద్రానాయక్, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతుల జీవన ప్రమాణాలపై సర్వే



మైదుకూరు మండలం సరస్వతిపేటలో నిర్వహించిన సర్వేలో పాల్గొన్న జేడీ శారదమ్మ

కడప రూరల్, జూలై 28: జిల్లాలోని పాడి రైతులు, గొర్రెలు, మేకల కాపరుల జీవన ప్రమాణాలు, స్థితిగతులపై సమగ్ర సర్వేకు జిల్లా పశుసంవర్థకశాఖ చర్యలు చేపట్టింది. జిల్లాలోని 70,349 కుటుంబాలను సమగ్ర సర్వే చేయనున్నారు. ఈ మేరకు జిల్లాలో గత శుక్రవారం నుంచి అధికారులు సర్వే ప్రారంభించారు. ఈ సర్వే సెప్టెంబరు 15 వరకు జరుగుతుంది. ఇందులో వెటర్నరీ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొని ఆయా కుటుంబాల్లో పాడి, గొర్రెలు, మేకలు, కోళ్ల ద్వారా ఎంత ఆదాయం వస్తుంది? బ్యాంకు రుణాలు తీసుకున్నారా? ప్రభుత్వ పరంగా ఏయే పథకాలు వర్తిస్తున్నాయి? ఇంకా ఏవైనా అవసరమా? తదితర అంశాలతో సమగ్ర సర్వే చేస్తున్నారు. ఈ సర్వే రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరక్టర్ శారదమ్మ చెప్పారు. రైతులందరు పశుసంవర్ధకశాఖ అధికారులకు సహకరించి వారు కోరిన వివరాలను తెలియజేయాలన్నారు.

పాస్‌పోర్టు సేవలలో ప్రథమస్థానం



జ్ఞాపికతో ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసుశాఖ మరోమారు అభినందనలు దక్కాయి. ఇతర దేశాలకు వెళ్లే వారికి సకాలంలో, వేగవంతంగా పాస్‌పోర్టు సేవలందించినందుకు జిల్లా పోలీసు శాఖ రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు 46,532 పాస్‌పోర్టు దరఖాస్తులను కేవలం మూడురోజుల వ్యవధిలో విచారణ పూర్తిచేసి రాష్ట్రంలోనే అత్యుత్తమ పనితీరు కనబరిచారు. ఈ మేరకు విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి శివహర్ష చేతుల మీదుగా జిల్లా పోలీసువిభాగం స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీ ఎన్.సుధాకర్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీని, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు దారెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆర్.పురుషోత్తంరాజు, పాస్‌పోర్టు వెరిఫికేషన్ యూనిట్ కానిస్టేబుల్ సుబ్బరాజు, ఇతర సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్

కడప రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మంగళవారం నోటిఫికేషన్ జారీచేసింది. ఎన్నికల పక్రియను జూలై 30 నుంచి ప్రారంభించి ఆగస్టు 14 నాటికి పూర్తిచేయాలని ఆదేశించింది. ఈ నెల 30 నుంచి ఆగస్టు 1 వరకు నామినేషన్ల స్వీకరణ, 2న నామినేషన్ల పరిశీలన, 3న నామినేషన్ల తిరస్కరణ, 5న నామినేషన్ల తుదిజాబితా ప్రకటన, 12వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 5 గంటల వరకు పోలింగ్, 13న రీపోలింగ్, 14వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు, తదుపరి ఫలితాలు వెల్లడించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలతో జడ్పీ అధికారులు ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. కాగా.. 2023 ఫిబ్రవరి 18న పులివెందుల జడ్పీటీసీ సభ్యుడు తుమ్మల మహేశ్వర్‌రెడ్డి మృతి చెందారు. ఒంటిమిట్ట జడ్పీటీసీ ఆకేపాటి అమరనాథరెడ్డి 2024లో జరిగిన సాధారణ ఎన్నికల్లో రాజంపేట ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో ఆయన తన జడ్పీటీసీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ రెండు స్థానాలకు ఇప్పుడు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఒంటిమిట్ట జడ్పీటీసీ పరిధిలో 13 పంచాయతీలు, పులివెందుల జడ్పీటీసీ పరిధిలో 6 పంచాయతీలలో ఓటర్లు ఉన్నారు.

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం వాయిదా

కడప రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించాల్సిన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని వాయిదా సీఈవో సి.ఓబులమ్మ తెలిపారు. జడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల అయిన నేపథ్యంలో సంబంధిత అంశాలపై బుధవారం ఉదయం 11 గంటలకు ఎలక్షన్ కమిషన్ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో జడ్పీ స్థాయి సంఘాల సమావేశాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు. తదుపరి సమావేశం ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామన్నారు.

పుట్టగొడుగుల్లా మినరల్ వాటర్‌ప్లాంట్స్

- నాణ్యతకు తిలోదకాలు...
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

6

జమ్మలమడుగులో సోలార్ పవర్ ప్రాజెక్టు



కలికిరి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె వద్ద 400 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడానికి జేఎస్‌డబ్ల్యూ (జిందాల్ సౌత్ వెస్ట్) కంపెనీకి ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకు ముందు రాయలసీమ స్టీల్ ప్రాజెక్ట్ కోసం జిందాల్‌కు కేటాయించిన 1,100 ఎకరాలు, టౌన్‌షిప్ ఏర్పాటుకు 200 ఎకరాలు పోనూ.. వైఎస్సార్ స్టీల్ కార్పొరేషన్ కోసం సేకరించిన భూముల్లో సోలార్ కోసం కేటాయించే 2,400 ఎకరాలకు.. ఎకరాకు ఏడాదికి రూ.31 వేల వంతున 30 ఏళ్లపాటు లీజుకు కేటాయించేందుకు అంగీకరించింది. ప్రతి ఐదేళ్లకు 5 శాతం లీజు పెంపు నిబంధనను కూడా విధించింది. ఈ మేరకు తగు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, జలవనరులు, పరిశ్రమల శాఖలతో పాటు ఏపీట్రాన్స్‌కోను ఆదేశిస్తూ ఇంధన శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి (ఇన్‌చార్జి) కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

టీడీపీలో చేరుతున్నా

- అభివృద్ధికి జగన్ సహకరించలేదు
- బి.మఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వీరనారాయణరెడ్డి


బ్రహ్మంగారిమఠం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ హయాంలో కార్యకర్తల అభివృద్ధికి ప్రభుత్వం ఏమాత్రం సహకరించ లేదని, పార్టీలో తనను నమ్ముకున్న వారికోసం ఇప్పుడు టీడీపీలో చేరుతున్నామని బి.మఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డి అన్నారు. ఇటీవల మండలంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చేసిన అభివృద్ధిని చూసి టీడీపీలో చేరాలని ఎంపీపీ వీరనారాయణరెడ్డి, ఆయన సోదరులు మాజీ సింగిల్‌విండో చైర్మన్ చిలేకాంపల్లె నాగేశ్వర్‌రెడ్డి, ఉప సర్పంచ్ చిలేకాంపల్లె కొండారెడ్డి, కుమారుడు చిలేకాంపల్లె సీతారామిరెడ్డి, నాగిరెడ్డి, కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో బ్రహ్మంగారిమఠంలో సోమవారం శ్రీయోగి వేమన రెడ్ల అన్నదాన సత్రంలో తోటి ప్రజా ప్రతినిధులు, బంధువులు, స్నేహితులు, కుటుంబసభ్యులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీర నారాయణరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అనేక సేవలు చేసినప్పటికీ ప్రజలను అభివృద్ధి బాటలో నడిపించేందుకు ప్రభుత్వం సహకరించ లేదన్నారు. 42 సంవత్సరాలు తమ కుటుంబం ప్రజాసేవ లోనే ఉందన్నారు. మన ప్రాంత అభివృద్ధి కోసం తన కుటుంబ సభ్యులందరూ బుధవారం మైదుకూరు ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరుతున్నామని తెలిపారు. తమ వెంట వచ్చిన వారికి ప్రాణం ఉన్నంత వరకూ సాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల అభివృద్ధి కోసమే టీడీపీలోకి వెళుతున్నామని అన్నారు.

నేడు జైళ్ల శాఖ డీజీ రాక

కడప క్రైం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జైళ్ల శాఖ డీజీ అంజనీకుమార్ మంగళవారం కడప కేంద్ర కారాగారానికి రానున్నారు. అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించిన అనంతరం జైలును తనిఖీ చేయనున్నారు. ఇటీవల జైలులో వరుసగా సెల్‌ఫోన్లు దొరికాయి. అందులోనూ రిమాండు ఖైదీ వద్దనే ఎక్కువ మొబైల్స్ దొరకడంతో డీఐజీ రవికిరణ్ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించి పలువురు అధికారులను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఇక్కడ జరిగిన అవినీతికి సంబంధించి ఒక్క అధికారిపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో డీజీ కడపకు రానుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

సీఎం పర్యటనను విజయవంతం చేయండి

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి చిత్రంలో ఎస్పీ అశోక్‌కుమార్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఆర్డీవో సాయిశ్రీ, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటనకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై సోమవారం సాయంత్రం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో ఎస్పీ అశోక్‌కుమార్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డితో కలసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పేదలకు పెన్షన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి ఆగస్టు 1వ తేదీన జమ్మలమడుగుకు రానున్నారన్నారు. అందులో భాగంగా గూడెంచెరువు గ్రామంలో లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేస్తారన్నారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతం చేయడానికి జిల్లా అధికారులకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, మెప్మా, డీఆర్‌డీఏ డ్వామా పీడీలు కిరణ్‌కుమార్, రాజ్యలక్ష్మి, ఆదిశేషారెడ్డి, ఎస్‌డీసీలు వెంకటపతి, రంగస్వామి, డీఎంహెచ్‌వో నాగరాజు, జడ్పీసీఈవో ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

హెలిప్యాడ్ స్థలం పరిశీలన

ముఖ్యమంత్రి ఆగస్టు 1వ తేదీ రానున్న నేపథ్యంలో సోమవారం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ అశోక్‌కుమార్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, ఆర్డీవో సాయిశ్రీ తదితరులు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పక్కన ఏర్పాట్లు చేసిన హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి గూడెంచెరువు పంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీ ఎదురుగా టిడ్కో గృహాలకు వెనుకభాగాన హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. గూడెం చెరువు గ్రామంలో పెన్షనర్ల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి జీవన స్థితిగతులను ఆరా తీశారు. ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాటుకోసం టిడ్కో కాలనీ ఎదురుగా ఉన్న ఖాళీ మైదానాన్ని కలెక్టర్ పరిశీలించి అక్కడి నుంచి అనుకూలతలపై సెక్యూరిటీ అంశాలపై మాట్లాడారు. గండికోట పర్యాటక క్షేత్రం వద్ద హెలిప్యాడ్ స్థలాన్ని గండికోట గార్జ్ వ్యూ పాయింట్, కోట పరిసరాలను, టూరిస్టు గ్లాంప్‌ను వారు పరిశీలించారు.

గండికోటను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలి

- 20 సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్



గండికోట లోయ వద్ద 20 సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్ తదితరులు

జమ్మలమడుగు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన గండికోటలో మంచి వసతులు కల్పించడం ద్వారా అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని రాష్ట్ర 20 సూత్రాల కార్యక్రమ అమలు చైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. సోమవారం గండికోటను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాధవరాయస్వామి దేవాలయం, గండికోట నిర్మాణంలో పెమ్మసానివారి చరిత్ర మరువలేనిదన్నారు. అద్భుత శిలా నైపుణ్యం ఇక్కడ చూడవచ్చన్నారు. పర్యాటకులు వీక్షించదగిన ప్రాంతాలకు రాకపోకల రహదారుల మార్గాలను అభివృద్ధిపరచాలన్నారు. పర్యాటకుల సౌకర్యార్థం ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి మ్యూజికల్, సంప్రదాయ వస్తువులను ఉంచాలన్నారు. ఇక్కడే మినీ థియేటర్ ఏర్పాటు చేసి తెలుగుభాష గొప్పదనం, వేమన, అన్నమాచార్య మహాకవులు రూపొందించిన గ్రంథాలను ఏర్పాటు చేయాలన్నారు. అడ్వెంచర్, ట్రెక్కింగ్ తదితర సౌకర్యాలపైన అధికారులతో ఆయన సమీక్షించారు. గండికోటకు ప్రతినెల 20 వేల మంది పర్యాటకులు వస్తున్నారని, సరైన సౌకర్యాలు కల్పిస్తే నెలకు దాదాపు ఒక లక్ష మంది వచ్చే అవకాశం ఉందన్నారు. దీంతో ఇక్కడి ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ గురుఈశ్వర్, రెవెన్యూ సిబ్బంది, టూరిజం అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల కోసమే పీజీఆర్ఎస్ కార్యక్రమం

● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు


దివ్యాంగుడి వద్ద సమస్యను తెలుసు కుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): పలు రకాల సమస్యలతో వచ్చే ప్రజల కోసమే ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులు చెబుతున్న ప్రతి ఒక్క సమస్యను వివరాలతో సహా ఎస్పీ అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులకు పంపించి త్వరగా పరిష్కరించమని ఆదేశించారు. బాధితులు చెబుతున్న మాటల్లో వాస్తవికతను దృష్టిలో పెట్టుకుని సమస్యలను పరిష్కరించడంలో వేగం పెంచాలన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో జవాబుదారీ తనం కలిగి ఉండాలని, ప్రత్యేకించి వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని ప్రజలు జిల్లాలోని వారి పరిధిలో గల పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని రైల్వేకోడూరు మండలం సి.కమ్మపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు బాలు కోటేశ్వరరావు (బాబు రాజేశ్వరమ్మ) నడవలేని పరిస్థితిలో తన తల్లి సమస్యను చెప్పుకునేందుకు ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్పీ అతని వద్దకు వెళ్లి సమస్యను విన్నారు. అతను ఇచ్చిన ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ చట్ట పరిధిలో అతని సమస్యను పరిష్కరించాలని రాజంపేట ఏఎస్పీని ఆదేశించారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

● డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు


శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు

రాయచోటి టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులే సమాజ నిర్మాణానికి మూల స్తంభాలని డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని అర్చన కళాశాలలో ఈ నెల 28 నుంచి 31 వరకు పాఠశాల నాయకత్వ లక్షణాలపై నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణా తరగతులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ తరగతుల ప్రారంభ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు ఉత్తమ బోధకుడిగా ఎదిగితేనే విద్యార్థులు విజేతలుగా మారతారని తెలిపారు. ఉపాధ్యాయులు మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన బోధనా పద్ధతులను అవలంబించాలని సూచించారు. ఉపాధ్యాయులు నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ విద్యార్థులకు ఉత్తమ విద్య అందించాలన్నారు. అనంతరం డైట్ సీనియర్ లెక్చరర్ నరసింహారెడ్డి, అనంతరం అర్చన విద్యాసంస్థల డైరెక్టర్ పాపిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి, అనంతరం సమగ్ర శిక్ష ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ జనార్ధన్‌లు మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలకు వెలుగులు నింపేలా, వారికి సరైన మార్గ నిర్దేశనం చేసేలా ఉపాధ్యాయులు పనితీరును మెరుగుపర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ షమీముల్లా, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు వీరాంజనేయులు, డైట్ లెక్చరర్ కరీముల్లా, శిక్షణ ఇచ్చే మాస్టర్ ఫెసిలిటేటర్స్, జిల్లాలోని 280 మంది ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా

● ఒకరికి స్వల్ప గాయాలు


పెద్దవంకలో అదుపు తప్పి బోల్తాపడ్డ ఆటో

సిద్దవటం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భాకరాపేట -సిద్దవటం రహదారి పోలీసు బెటాలియన్ సమీపాన లోకాజ్‌వేపై సోమవారం అదుపు తప్పి ఆటో బోల్తా పడడంతో విజయ్ అనేవ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ బాబు మాట్లాడుతూ గువ్వల చెరువు నుంచి పాలకోవ వ్యాపారం నిమిత్తం సిద్దవటానికి వచ్చామని, తిరుగు ప్రయాణంలో భాకరాపేట సమీపాన బద్వేలు వైపు వెళుతున్న వాహనం అడ్డు రావడంతో తప్పించబోయి అదుపు తప్పి బోల్తాపడిందని తెలిపారు. ఆటోలో ఉన్న విజయ్ అనేవ్యక్తికి స్వల్పగాయాలు కావడంతో స్థానిక ప్రైవేటు వైద్యశాలలో వైద్యం చేయించామని, ప్రమాదం జరిగిన ఘటనలో ఆటో పాక్షికంగా దెబ్బతినిందని తెలిపారు. ఈ విషయమై ఎస్ఐ మహమ్మద్‌రఫీ మాట్లాడుతూ జరిగిన ఘటనపై విచారిస్తున్నామని, ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

సామాజిక తనిఖీ నిష్పక్షపాతంగా చేయాలి

గుర్రంకొండ, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో కూలీలు చేసిన పనులు, సీసీ రోడ్లు, గోకులాల షెడ్లు, హార్టికల్చర్ పనులను నిష్పక్షపాతంగా తనిఖీ చేయాలని ఎస్ఆర్పీ తిరుమలేష్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సామాజిక తనిఖీ బృందం కోఆర్డినేట్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతుల పొలాలు, చెరువు పనులు, సీసీ రోడ్లు, గోకులాల షెడ్ల పనులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ మధుబాబు, ఏపీవో జయరామిరెడ్డి పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా మినరల్ వాటర్‌ప్లాంట్స్

- మూడు పువ్వులు.. ఆరు కాయలుగా వ్యాపారం
- లైసెన్స్‌లు, ఐఎస్ఐ గుర్తింపులు ఉండవు
- నాణ్యతకు తిలోదకాలు...
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం
- విచ్చలవిడిగా వాటర్ బాటిల్స్ విక్రయం
- పట్టించుకోని మున్సిపల్, ప్రజారోగ్యశాఖ అధికారులు


ప్రైవేటు వాటర్ ట్యాంకర్ వద్ద నగదు వెచ్చించి నీటిని కొనుగోలు చేస్తున్న ప్రజలు



కొత్తపేటలో నూతనంగా వెలసిన ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్

అది అన్నమయ్య జిల్లా కేంద్రం.. అందులోనూ స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ. ఇక్కడ గుటగుటా తాగడానికి లీటర్ల కొద్దీ మద్యం దొరుకుతుందేమో కానీ దప్పిక తీర్చుకోవడానికి గుక్కెడు మంచినీళ్లు లభించవు. వెలిగల్లు ప్రాజెక్టు నుంచి రాయచోటి మున్సిపాలిటీకి నీటిని సరఫరా చేసే నీటి పథకానికి నెల నెల లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ ఆ నీరు తాగడానికి పనికిరాకుండా పోతున్నాయి. దీంతో రాయచోటి పట్టణ ప్రజలు దాహార్తి తీర్చుకునేందుకు ప్రతినిత్యం వీధుల వెంబడి వచ్చే మినరల్ వాటర్ ట్యాంకర్‌లను ఆశ్రయించక తప్పడం లేదు.

రాయచోటిటౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో మినరల్ వాటర్ ప్లాంట్స్ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఐఎస్ఐ మార్క్ లేకుండా నాణ్యతకు తిలోదకాలు ఇస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నప్పటికీ అటు మున్సిపల్ అధికారులు కానీ, ఇటు ప్రజారోగ్య శాఖ అధికారులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదు. జిల్లా కేంద్రంలో వీధివీధికి విచ్చలవిడిగా వెలుస్తున్న వాటర్‌ప్లాంట్ ద్వారా నిర్వాహకులు కోట్లు గడిస్తున్నారు. శుద్ధమైన తాగునీటి జలాలను అందిస్తామని చెబుతూ నీటి వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు. ఒక్కో వాటర్ క్యాన్ ధర రూ.10-30ల వరకు విక్రయిస్తున్నారు. కేవలం రాయచోటి పట్టణమే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో సైతం వాటర్ ప్లాంట్ విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. వాటర్ ప్లాంట్స్ నిర్వాహకులు నీటిశుద్ధి కోసం అవగాహన రాహిత్యంతో విపరీతమైన కెమికల్స్ వాడకంతో ప్రజలు అనేక రకాలైన జబ్బులకు గురవుతున్నారు. నాసిరకం ఆక్సిజన్ వినియోగిస్తూ వేల సంఖ్యలో వాటర్ ప్యాకెట్లు, బాటిల్స్ తయారు చేస్తున్నారు. అంతేగాక ఐఎస్ఐ నిబంధన ప్రకారం లైసెన్సులు పొందకుండానే నీటి వ్యాపారాలకు తెరతీస్తున్నారు. ఇలా కేంద్రంలో కనీస నిబంధనలను పాటించకుండా అక్రమంగా మినరల్ వాటర్ ప్లాంట్స్ సుమారు 100కు పైగా ఏర్పాటు చేసి మూడు పువ్వులు.. ఆరు కాయలుగా వ్యాపారం సాగిస్తున్నారు.

ఐఎస్ఐ మార్క్ గురించి అడక్కూడదు

సాధారణంగా ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వహించాలంటే సుమారు అరకోటికి పైగా ఖర్చు అవుతుంది. అయితే ఐఎస్ఐ అనుమతి లేని మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వహణకు రూ.20 లక్షల లోపే అవుతుంది. గంటకు వెయ్యి లీటర్లు కెపాసిటీతో పనిచేసే ప్లాంట్‌కు ఒక ధర, గంటకు 10 వేల నుంచి 20 వేల లీటర్లు ఉత్పత్తి చేసే ప్లాంట్స్‌కు ఒక ధర నిర్ణయిస్తున్నారు. దీంతో వాటర్ ప్లాంట్ నిర్వాహకులు అధిక శాతం నీటి వ్యాపారం అతి తక్కువ ఖర్చుతో ఐఎస్ఐ మార్కు అనుమతి లేకుండా విచ్చలవిడిగా నీటి వ్యాపారం చేస్తూ ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతున్నారు.

నాణ్యత ప్రమాణాలు గాలికి

సాధారణంగా వాటర్ ప్లాంట్‌లో పనిచేసే కార్మికులకు ఆరు నెలలకొకసారి ఆరోగ్య పరీక్షలు చేయించాల్సి ఉంది. అలాగే నీటిని శుద్ధి చేయాలంటే నీటిని ముందుగా ఇసుక ఫిల్టర్‌లోకి, అనంతరం కార్బన్ ఫిల్టర్‌లోకి పంపాలి. తర్వాత రెండు ఫిల్టర్స్ ద్వారా శుద్ధి చేసి ఆర్‌వో ప్లాంట్‌కు నింపాలి. అక్కడ నుంచి రివర్స్ ఓస్మాసిస్ ద్వారా యూఎస్‌పి ర్యాంపునకు ఆపై ఫెర్టిలైజేషన్ చేసిన అనంతరం ఓజోనైజేషన్ చేయాలి. అక్కడి నుంచి నీటిని ట్యాంకులకు నింపి అక్కడ 24 గంటల వరకు నిల్వ ఉంచిన తర్వాతే వినియోగించాల్సి ఉంది. అలాగే ప్రతి వాటర్ ప్లాంట్ కేంద్రంలో మైక్రో బయోకెమిస్ట్రీ ల్యాబ్‌తో పాటు ప్లాంట్‌లో ఏసీ ర్యాబ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే రాయచోటి పట్టణంలో ఉన్న ఏ ఒక్క వాటర్ ప్లాంట్‌లో కూడా నియమ నిబంధనలు ఆచరణలకు నోచుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఇటువంటి నీటిని తాగితే ప్రజలు మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాల భారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వాటర్ ప్లాంట్స్‌లో నీటి అమ్మకాల నాణ్యతపై దృష్టి సారించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం

- వాసుబాబు, మున్సిపల్ కమిషనర్, రాయచోటి

రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్స్‌ను ప్రజా ఆరోగ్యశాఖ అధికారులతో కలిసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. పట్టణంలో ప్రభుత్వ వాటర్ ప్లాంట్స్ 9 ఉండగా అందులో మూడు మాత్రమే నడుస్తున్నాయి. మిగిలిన 6 వాటర్ ప్లాంట్స్ రన్నింగ్‌లో లేవు.

ప్రతి పల్లెలోనూ మినరల్ వాటర్ ట్యాంకులు


కోనంపేటలో నిరుపయోగంగా ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్

లక్కిరెడ్డిపల్లె, జూలై 28(ఆంధ్రజ్యోతి): అసలే వర్షాలు లేక గ్రామాల్లో ఉన్న మంచినీటి పథకం బోర్లు ఎండిపోతున్న తరుణంలో ఇదే అదునుగా చేసుకొని ప్రైవేటు మినరల్ వాటర్ యాజమాన్యం ప్రతి పల్లెకు ట్యాంకులు తిప్పుతూ బిందె రూ.10 క్యాన్ రూ.20 వసూలు చేస్తున్నారు. అయితే ఆ వాటర్ పూర్తి స్థాయిలో శుద్ధి చేశారా లేదా అలాగే తీసుకెళ్లి పల్లెలో విక్రయిస్తున్నారా అనే విషయంపై అధికారులు ఏ మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపణలున్నాయి. గతంలో 2016లో ఎంపీ గ్రాంట్ కింద లక్కిరెడ్డిపల్లె ఎంపీడీవో ఆవరణంలో, అలాగే కోనంపేటలో ప్రభుత్వ మినరల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం అవి మూలనపడ్డాయి. ఇదే అదునుగా ప్రైవేటు ప్లాంటు వెలిసి అందినకాడికి ప్రజల నుంచి దోచుకుంటున్నారు. లక్కిరెడ్డిపల్లెలో దాదాపు పదిపైనే ప్రైవేటు వాటర్ ప్లాంట్లు ఉన్నా అధికారులు చోద్యం చూస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలకు శుభ్రమైన నీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు, రైతులు

రాజంపేటటౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏఐకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ వైఖోం నిదియాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో దాదాపు 20వేల ఎకరాలకు పైగా బొప్పాయి సాగు చేస్తున్నారన్నారు. సాగు కోసం రైతులు వేలాది రూపాయలు ఖర్చు చేశారని, అందుకుతగ్గ ఫలం అందడం లేదన్నారు. రైతులు కల్తీ విత్తనాలు, దళారులతో తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. అందుకు సబ్‌కలెక్టర్ స్పందిస్తూ మార్కెటింగ్ హార్టికల్చర్ ఇండస్ట్రియల్ అధికారులతో సమావేశమై న్యాయం జరిగేలా చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, రైతు సంఘం ఏఐకేఎస్ జిల్లా నాయకుడు మణి, కోటయ్యనాయుడు, డి.గిరిబాబురాజు, పెంచల్‌రెడ్డి, శివక్రిష్ణచౌదరి, విశ్వనాథ్‌రెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

పెట్టుబడుల కోసమే సీఎం పర్యటన

● రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): పెట్టుబడుల కోసమే సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనకు వెళ్లారని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదేళ్ల రాష్ట్రాన్ని దోచుకొని పారిశ్రామికీకరణ అనే పదమే రాష్ట్రంలో వినపడకుండా చేసి ప్రజల జీవనోపాధిని వైసీపీ నేతలు దెబ్బతీశారన్నారు. దెబ్బతిన్న ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకే ఆయన పర్యటిస్తున్నారని తెలిపారు. పేదల భూములు దోచుకోవడానికి వైసీపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొస్తే, సీఎం చంద్రబాబు అంతర్జాతీయ కంపెనీలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పిస్తున్నారన్నారు. పారిశ్రామికవేత్తలకు విశ్వాసం, నమ్మకం కల్పించి రాష్ట్రానికి సీబీఎస్ పరిశ్రమలు తెస్తుంటే వైసీపీ భవిష్యత్ చీకటి మయం అవుతుందనే భయంతో తాడేపల్లి ప్యాలెస్ నేతలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారన్నారు. చంద్రబాబు కృషితో రాష్ట్రానికి పరిశ్రమలు రావడంతో వాటిని ఆపేందుకు జగన్‌రెడ్డి కుట్రలు పన్నుతున్నారన్నారు. టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థల మినహా మరే ఇతర సంస్థలకు కూటమి ప్రభుత్వం ఎకరా రూ.99 పైసలకే ఇవ్వలేదన్నారు. కంపెనీలకు భూకేటాయింపులపై వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉర్సా డేటా సెంటర్‌కు ఎకరా రూ.55 లక్షలు, ఐటీ ఆఫీస్‌కు ఎకరా రూ.ఒక కోటి చొప్పున భూమి కేటాయించామన్నారు.

ఐదేళ్ల జగన్‌రెడ్డి అసమర్థ పాలన వలన ఎఫ్‌ఐల్లో దేశంలో ముందుండాల్సిన రాష్ట్రం రూ.6,808.20 కోట్లతో అట్టడుగుకు చేరిందన్నారు. కోర్టు పర్మిషన్ తీసుకొని మరీ సతీ సమేతంగా ప్రత్యేక విమానంలో దావోస్ పర్యటనకు పెట్టుబడుల కోసం అని చెప్పి ప్రజాధనంతో జగన్‌రెడ్డి ఫ్యామిలీ టూర్ వేశారని విమర్శించారు.

హార్సిలీహిల్స్‌లో కొండచిలువ


ఘాట్‌రోడ్డులో కొండచిలువను రోడ్డు దాటిస్తున్న దృశ్యం

బి.కొత్తకోట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డులో ఓ కొండ చిలువ ప్రత్యక్షమైంది. ఘాట్‌రోడ్డులోని గంగోత్రి కొలను సమీపంలోని మలుపులో దీన్ని పర్యాటకులు గమనించారు. చిన్నపాటి జంతువులను మింగి ఎగువ భాగంలోంచి రోడ్డుపైకి వచ్చింది. కడుపు బరువైన కారణంగా రోడ్డుకు ఆనుకొని వున్న పిట్టగోడను దాటి దిగువ భాగంలోకి వెళ్లలేక పోయింది. విషయం తెలియడంతో పలువురు సంఘటనా స్థలంలో గుమికూడారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఇంతలో కొండపై నివాసం వుంటున్న దేవదాసు అనే వ్యక్తి ధైర్యం చేసి ఓ కర్ర సాయంతో కొండచిలువను పిట్టగోడ దాటించాడు. దీంతో ఆ పాము సురక్షితంగా అటవీ ప్రాంతంలోకి వెళ్లింది. కొండచిలువను కాపాడిన దేవదాసును అటవీశాఖ అధికారులతో పాటు పలువురు అభినందించారు.

విషద్రావణం సేవించి వీఆర్ఏ మృతి

ఓబులవారిపల్లె, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొర్లకుంట గ్రామ పంచాయతీకి చెందిన వీఆర్ఏ ఓబులవారిపల్లె రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఉన్న పొలాల దగ్గర మృతి చెందినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. చీర్ల కృష్ణయ్య(65) కొర్లకుంట వీఆర్ఏ గత రెండు రోజులుగా కనిపించడం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో విషద్రావణం తాగి మృతిచెందడంతో వారు లబోదిబోమంటున్నారు. కాగా అతనికి భార్య, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పెంచలోరి నిత్యాన్న పథకానికి విరాళం


ఆలయ అధికారులకు నగదు అందజేస్తున్న దృశ్యం

రాపూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్న పథకానికి రైల్వే కోడూరుకు చెందిన నాలబాల ఆనంద్‌కుమార్, రోహిణీలత దంపతులు సోమవారం రూ. 1,18,000 దేవస్థానం సిబ్బందికి అందించారు. అనంతరం దాతలకు ఆలయ అధికారులు మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

కలికిరి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.అంజలీదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బి.కాం జనరల్, బి.కాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ బాటనీ కోర్సుల్లో ప్రవేశాలకు అవసరమైన దరఖాస్తులు కళాశాలలోనే అందుబాటులో వున్నాయని ఆమె తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తయిన అర్హత కలిగిన విద్యార్థినులు వెంటనే దరఖాస్తులు పంపుకోవచ్చని వివరించారు.

దూసుకొచ్చిన మిల్లర్.. విరిగిన కాలు


కాలువిరిగిన బాలిక నందిత

బి.కొత్తకోట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాంక్రీట్ మిల్లర్ మీదకు దూసుకురావడంతో ఓ బాలిక కాలు విరిగిన సంఘటన సోమవారం బి.కొత్తకోటలో జరిగింది. పట్టణంలోని బైపాస్‌రోడ్డు ఎస్సీ కాలనీకి చెందిన రామాంజులు కుమార్తె నందిత(11) ఉదయం స్కూలుకు వెళ్లేందుకు రోడ్డుపై నడుచుకుంటూ వెళుతోంది. అదే సమయంలో తన ముందు ఓ కాంక్రీటు మిల్లర్‌ను ఈడ్చుకుంటూ కూలీలను ఎక్కించుకుని ఓ టెంపో వెళుతోంది. కాగా ప్రమాదవశాత్తు మిల్లర్‌కు కట్టిన తాడు తెగిపోయింది. దీంతో ఆ మిల్లర్ వెనక్కు వచ్చి నందితను ఢీకొనడంతో ఆ బాలిక కిందపడిపోయింది. మిల్లర్ కాలు మీద వెళ్లడంతో కాలు నుజ్జునుజ్జయింది. దీంతో కుటుంబీకులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రథమచికిత్స అనంతరం మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అంకిశెట్టిపల్లె నల్లగుట్టను పరిరక్షించండి

● పాడి రైతుల ఆవేదన


నల్లగుట్టను కాపాడాలని సబ్‌కలెక్టర్‌కు విన్నవిస్తున్న అంకిశెట్టిపల్లె గ్రామస్థులు

మదనపల్లెటౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకిశెట్టిపల్లె నల్లగుట్టను ఆక్రమణల నుంచి పరిరక్షించాలని అంకిశెట్టిపల్లె, వేంపల్లె గ్రామాల రైతులు సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్‌కు విన్నవించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్‌తో రెండు గ్రామాల రైతులు మాట్లాడుతూ అంకిశెట్టిపల్లె శివారులో 75 ఎకరాల విస్తీర్ణంలో నల్లగుట్ట వుందన్నారు. అనాధిగా ఈ గుట్టలోకి పశువులు తోలుకుని మేత మేపుకుంటున్నామన్నారు. అలాగే ఇదే గుట్ట పేట్లో గంగమ్మ దేవతను ప్రతిష్ఠించి ప్రతిఏటా గంగ జాతర నిర్వహిస్తున్నామన్నారు. ఈ గుట్టలో శీతాఫలం, పలురకాల పండ్లు కోసుకుని ఎస్టీలు, ఎస్సీ, బీసీలు జీవనాధారంగా బతుతుకున్నారని తెలిపారు. కొంత కాలంగా కొందరు నల్లగుట్టలో బుద్ధుని విగ్రహం ఏర్పాటు చేస్తుండగా గ్రామసభ నిర్వహించి, ప్రజలందరం వ్యతిరేకించామన్నారు. తాము బుద్ధ ప్రార్థనలకు వ్యతిరేకం కాదని, తమ జీవనాధారం అడ్డంకిగా వున్న అంశాలపైనే వ్యతిరేకిస్తున్నామన్నారు. దీనిపై విచారించి నట్టగుట్టను పరిరక్షించి గ్రామస్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంకిశెట్టిపల్లె సర్పంచ్ శరత్‌రెడ్డి, ఎం.రమణ, ఎం.సుధాకర్, కె.వెంకటరమణ, ఎం.రమణనాయక్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 83 అర్జీలు

పీజీఆర్ఎస్ కార్యక్రమానికి డివిజన్ నలుమూలల నుంచి 83 మంది అర్జీలు వచ్చాయి. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో రోగులకు చికిత్స చేయకుండా ప్రైవేటు ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారని సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పీటీఎం మండలంలోని వ్యాసరాయస్వామి ఆలయ భూములను వీఆర్‌వో అక్రమంగా కొందరు భూస్వాములకు ఆన్‌లైన్ చేయిస్తున్నారని లక్ష్మన్న ఫిర్యాదు చేశాడు. వీటితో పాటు ఎక్కువగా భూ వివాదాలు, సర్వే సమస్యలపైనే వినతులు వచ్చాయి. వీటిని వారం రోజుల్లోగా విచారించి బాధితులకు సమాధానం పంపాలని సంబంధిత అధికారులను సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

మదనపల్లె సీఐ ఎరిషావలి సస్పెన్షన్?

మదనపల్లె, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వహించారని మదనపల్లె వన్‌టౌన్ సీఐ ఎరిషావలిని సస్పెండ్ చేస్తూ సోమవారం డీజీపీ హరీశ్‌కుమార్ గుప్త ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె సమీపంలోని నల్లగుట్టపై ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుడి విగ్రహం తలను గుర్తు తెలియని వ్యక్తులు నరికిన విషయం తెలిసిందే. దీనిని నిరసిస్తూ నిందితులను అరెస్టు చేయాలంటూ బాస్ అధినేత, పీటీఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. వన్‌టౌన్ సమీపంలోనే అరగుండు, అరమీసంతో నిరసన తెలిపారు. ఇందులో ఆందోళనకారులను కట్టడి చేయడంలో సీఐ ఎరిషావలి విఫలమయ్యారని పోలీసు పెద్దలు భావించారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు సమాచారం వెళ్లడంతో సీఐని సస్పెండ్ చేస్తూ డీజీపీ సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

వ్యక్తిని కాపాడిన పోలీసులు

సిద్దవటం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం గ్రామనివాసి ఖాజాపీర్ అనే యువకుడు సోమవారం రాత్రి స్థానిక పెన్నానది వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తూ నదిలో పడ్డాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో పెన్నానదిలోకి గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టి యువకుడిని క్షేమంగా వెలికితీశారు. ఏఎస్ఐ సుబ్బరామచంద్ర మాట్లాడుతూ పెన్నానది వద్దకు ఎవరూ వెళ్లవద్దని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా వెళ్లడం సరికాదన్నారు.

'కమిటీ నిబంధనలు పాటించాలి'

గుర్రంకొండ, జూలై 28(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మార్కెట్ యార్డులో వ్యాపారులు కమిటీ నిబంధనలను పాటించాలని వైస్ చైర్మన్ నౌషాద్‌అలీ అన్నారు. సోమవారం గుర్రంకొండ మార్కెట్ యార్డులో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి చిన్న క్రేట్‌లను అమలు చేయాలని సూచించారు. అలాగే వేలంలో పాడిన ధరనే రైతులకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బయ్యారెడ్డి,బాబాజాన్, కార్యదర్శి కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకాంక్ష జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

● 20 సూత్రాల చైర్మన్ లంకా దినకర్



మాట్లాడుతున్న 20 సూత్రాల చైర్మన్ లంకా దినకర్

కడప కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): భౌగోళిక పరిస్థితుల వల్ల వెనుకబడిన జిల్లాలను ఆకాంక్షిత జిల్లాలుగా కేంద్రం గుర్తించిందని, ఆయా జిల్లాల అభివృద్ధికి ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని రాష్ట్ర 20 సూత్రాల చైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో ఆకాంక్షిత జిల్లాల అంశంపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా లంకా దినకర్ మాట్లాడుతూ ఆకాంక్షిత జిల్లాలో కడప జిల్లాలోని జమ్మలమడుగు, చింతకొమ్మదిన్నె మండలాలను ఎంపిక చేశారన్నారు. ప్రధాని మోదీ సంకల్పం వికసిత్ భారత్ సాధించాలన్నా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్ర 2047 సాధనకు వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి పథంలో నడపడం జరుగుతోందన్నారు. ఆరోగ్యం, పోషకాహారం, విద్య, మౌలిక సదుపాయాలు, వ్యవసాయానికి సంబంధించిన 49 సూచికలతో డాష్ బోర్డు ద్వారా రియల్ టైమ్ పురోగతిని ట్రాక్ చేయడం ఆకాంక్షిత జిల్లా ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కేంద్రం ప్రవేశ పెట్టిన ఆకాంక్షిత జిల్లా విధానం సఫలీకృతం అవుతోందనడానికి వైఎస్సార్ కడప జిల్లా సాధించిన ఫలితాలే నిదర్శనమన్నారు. 2019-24 మధ్య కాలంలో వైసీపీ ప్రభుత్వం హయాంలో కేంద్ర ప్రాయోజిత పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్లు పెట్టడంలో విఫలమైందన్నారు. దీంతో ఆశించిన ప్రగతిని సాధించే విషయంలో వెనుకబడిందనారు. 2024లో డబుల్ ఇంజన్ సర్కారు మ్యాచింగ్ గ్రాంట్ పెట్టడం, సకాలంలో పేదలకు విద్యకు సంబంధించిన అవసరాలపైన స్పందించడం, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించడం, మౌలిక సదుపాయాలు కల్పించడం వల్ల జిల్లాలో ఇపుడిప్పుడే సానుకూల ఫలితాలు రాబట్టడం జరుగుతోందన్నారు. ఆరోగ్యం, పోషకాహారం, మాతా శిశు మరణాలు, పిల్లల ఆరోగ్యం, ఇతర ఆరోగ్య, పోషకాహార సూచికలకు సంబంధించి 2025 మార్చి నాటికి 35వ స్థానానికి చేరుకుందన్నారు. విద్య, వ్యవసాయం, ఆర్థిక చేయూత, మౌలిక సదుపాయాలు లాంటి 5 అంశాలలో రాష్ట్రంలో పురోగతి సాధించే దిశగా సత్ఫలితాలను ఇస్తోందన్నారు. ఇప్పటి వరకు ఆకాంక్షిత జిల్లా వైఎస్సార్ కడప జిల్లాకు రూ.11.01 కోట్లు నిధులు అందాయన్నారు. వినియోగానికి రూ.10.32 కోట్లు, నిల్వ నిధులు రూ.6.9 కోట్లు కాగా రూ.93 లక్షల పనులు రద్దు చేయడం జరిగిందన్నారు. కొత్తగా వచ్చిన నిధులు రూ.5కోట్లతో కలిపి జిల్లా కేంద్రంలో నిల్వ ఉన్న నిధులు రూ.6.62 కోట్లు అని 20 సూత్రాల చైర్మెన్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీవో హజరత్తయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వైవీయూలో ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన యూనివర్సిటీ పీజీ కళాశాలలోని ఎమ్మెస్సీ మైక్రోబయాలజీ విభాగానికి గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కోసం ఈనెల 31వ తేదీ ఉదయం 10గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫసర్ టి.శ్రీనివాస్ తెలిపారు. మైక్రోబయాలజీలో పీహెచ్‌డీ, నెట్/స్లెట్ అర్హత కలిగిన వారికి ఎంపికలో ప్రాధాన్యత ఇస్తామన్నారు. అర్హత ప్రమాణాలు ఉన్న ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా ప్రిన్సిపాల్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఒక పోస్టుమాత్రమే ఖాళీఉందన్నారు.

చెర్లోపల్లె ఎంపీటీసీ మృతి



పెండ్లిమర్రి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెర్లోపల్లె ఎంపీటీసీ, యాదవాపురం గ్రామానికి చెందిన ఆదిమూలం కృష్ణయ్య (78) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఉదయాన్నే ఛాతిలో నొప్పిగా ఉందని చెప్పడంతో కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. గత ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎంపీటీసీగా ఎన్నికయ్యాడు. ఇతనికి భార్య వెంకట సుబ్బమ్మ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ప్రకృతిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత



మొక్కలు నాటుతున్న అధికారులు

● డీఆర్‌వో విశ్వేశ్వరనాయుడు

కడప(వినాయకనగర్), జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డీఆర్‌వో, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రత్యేక అధికారి విశ్వేశ్వర్‌నాయుడు పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా కడప నగరంలోని చెమ్ముమియాపేట జెడ్పీ బాలుర హైస్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వేశ్వరనాయుడు, స్టెప్ సీఈఓ సాయిగ్రాస్‌లు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి వారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్పెషలాఫీసర్ మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించి పెద్దవి చేయడం గొప్ప విషయం అన్నారు. ప్రతి విద్యార్థి మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని, తద్వారా భవిష్యత్ తరాల వారికి మేలు చేసిన వారవుతారన్నారు. అనంతరం ప్రతి విద్యార్థికి ఒక మొక్క పంపిణీ చేసి.. వాటిని ఇంటి వద్ద నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ పి.సుధాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిరాదేవి, పీడీ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయండి

● అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు

కడప క్రైం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయాలని అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసుకాన్ఫరెన్స్ హాలులో అదనపు ఎస్పీ సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో అదనపు ఎస్పీ మాట్లాడి వారి ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులకు పోలీసు సిబ్బంది ప్రశాంతంగా తమ సమస్యను వివరించడానికి సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ అబ్దుల్‌కరీం, మహిళా పీఎస్ డీఎస్పీ బాలస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ ఉపాధ్యాయులకు ఐఆర్, డీఏలను వెంటనే ప్రకటించాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం కరువు భత్యం, మధ్యంతర భృతిని త్వరగా ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మూడు విడతల కరువు భత్యం ప్రకటించిందని, రాష్ట్ర ప్రభుత్వం నాలుగు విడతల కరువు భత్యాన్ని ఇంతవరకు ప్రకటించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2023 జూలై నుంచి 12వ పీఆర్సీ అమలు చేయాల్సి ఉండగా ఇంతవరకు దాని ప్రస్తావనే లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పీఆర్సీ కమిషన్‌ను నియమించి 30 శాతం మధ్యంతర భృతిని ఇవ్వాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు రావాల్సిన 11వ పీఆర్సీ బకాయిలు, కరవు భత్యం బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, నాగరాజు, సుబ్బారెడ్డి, క్రిష్ణయ్య, అబ్దుల్‌ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదేశాలతో పెరిగిన పోలింగ్ బూత్‌లు

పులివెందుల రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలో ప్రభుత్వ ఆదేశాలతో పోలింగ్ బూత్‌లు పెరిగినట్లు తహసీల్దార్ నజీర్ అహ్మద్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి.. మారిన పోలింగ్ బూత్‌లు, పెరిగిన పోలింగ్ బూత్‌ల గురించి వివరించారు. పులివెందులలో వార్డ్ నెంబర్ 16, 26, 33, 32, (13,14,15), 15, 12తో పాటు వేంపల్లెలోని రామాలయం వద్దనున్న పోలింగ్ కేంద్రాలలో 1200పైగా ఓటర్లు ఓటు వేసేవారన్నారు. ఇపుడు వాటిని విభజించి ఆయా పోలింగ్ కేంద్రాల సమీపంలోనే 8 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 301 పోలింగ్ కేంద్రాలు ఉండగా పెరిగిన వాటితో 309 పోలింగ్ కేంద్రాలు అయ్యాయన్నారు. అలాగే శిథిలావస్థకు చేరిన పోలింగ్ కేంద్రాలు, మరమ్మతులకు గురైన పోలింగ్ కేంద్రాలను మార్చడం జరిగిందన్నారు. సింహాద్రిపురం మండలంలో సింహాద్రిపురంలో 2, కోవరంగుట్టపల్లెలో 2, అంకాళమ్మగూడూరులో 1, పులివెందుల మున్సిపాలిటీలోని యర్రగుడిపల్లె, చక్రాయపేట మండలంలోని కె.రాజుపల్లెలో పోలింగ్ కేంద్రాలను అతిసమీపంలో మార్చడం జరిగిందన్నారు. అలాగే సింహాద్రిపురం మండలంలో పాత భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించిన నేపథ్యంలో అదే ప్రాంతంలోనే మూడు పోలింగ్ కేంద్రాల పేర్లు మార్చడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీటీ వెంకటరెడ్డి, ఆర్ఐ షెక్షావలి తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచారం కేసులో మహిళకు ఏడేళ్లు జైలు శిక్ష

ప్రొద్దుటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వ్యభిచారం నిర్వహిస్తున్న కేసులో షేక్ హసీనా అలియాస్ బీబీ అనే మహిళకు ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.12వేల జరిమానా విధిస్తూ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఫైజున్నీసా సోమవారం తీర్పు ఇచ్చారు. 2015 జూలై 25న వసంతపేటలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో అప్పటి ఒన్‌టౌన్ సీఐ మహేశ్వరరెడ్డి దాడి చేసి షేక్ హసీనా అనే మహిళతో పాటు ఇల్లూరు మల్లికార్జునరెడ్డిలను అరెస్టు చేసి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కోర్టుకు పంపించారు. జూలై 28న విచారణ జరిపి ఏ1 నిందితురాలు షేక్ హసీనాపై నేరం రుజువు కావడంతో ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష రూ.12వేల జరిమానా విధించారు. రెండవ నిందితుడు ఇల్లూరు మల్లికార్జునరెడ్డిని నిర్దోషిగా పరిగణించి విడుదల చేశారు. ఈ కేసులో అడిషనల్ పీపీ బి.రాంప్రసాద్‌రెడ్డి వాదనలు వినిపించారు.

పెళ్లి చేసుకుంటానని మోసం.. యువతి ఆత్మహత్యాయత్నం

ప్రొద్దుటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని ఓ యువతిని మోసం చేయడంతో ఆమె తీవ్ర మనస్థాపానికి గురై యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. ప్రొద్దుటూరు మండలం కాల్వకట్ట వీధికి చెందిన మహేశ్వరరెడ్డి అనే వ్యక్తి ఓ అమ్మాయి 2018 నుంచి ప్రేమించుకుంటున్నారు. 2019లో పెళ్లి చేసుకుంటానని చెప్పి.. అప్పటి నుంచి ఆ అమ్మాయితో సహజీవనం చేస్తున్నాడు. పెళ్లి గురించి ఆ అమ్మాయి ఎప్పుడు ప్రస్తావించినా చేసుకుంటానని చెప్పి వాయిదాలు వేస్తూ వచ్చాడు. ఇటీవల ఆ అమ్మాయి గర్భం దాల్చింది. దీంతో బలవంతంగా గర్భం తీయించాడు. ఈ వ్యవహారం అబ్బాయి తల్లిదండ్రులకు తెలియడంతో వారు ఆ అమ్మాయికి ఫోన్ చేసి దారుణంగా తిట్టారు. ఈ విషయం మహేశ్వరరెడ్డికి చెప్పగా.. నిన్ను పెళ్లి చేసుకోను ఏమి చేసుకుంటావో చేసుకోఅని బెదిరించాడు. దీంతో మనస్థాపం చెందిన ఆ యువతి ఈనెల 20వ తేదీ యాసిడ్‌తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు రూరల్‌పోలీసులు మహేశ్వరరెడ్డి, అతని తల్లి సావిత్రి, తండ్రి దస్తగిరిరెడ్డి, మామ రాజేశ్వరరెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కొండపేటలో చోరీ

బంగారు నగలు, నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు, డాగ్‌స్క్వాడ్

చెన్నూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి బంగారుతో పాటు నగదు చోరీ చేసిన ఘటన చెన్నూరు మండలం కొండపేటలో జరిగింది. బాధితుడు పోలీసులకు తెలిపిన వివరాల మేరకు.. కొండపేటకు చెందిన సురేంద్ర ఇంటిలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రూ.2.10 లక్షల నగదుతో పాటు రెండు ఉంగరాలు, రెండు జతల మాటీలు, జత చెంప సవరాలు, రెండు జతల కమ్మలు చోరీ చేశారు. ఈ మేరకు సీఐ క్రిష్టారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బ్రాహ్మణవీధిలో చోరీ

కడప క్రైం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కడప నగరం బ్రాహ్మణ వీధిలో ఓ రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగింది. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు పద్మజ అనే రిటైర్డ్ ఉద్యోగి ఆదివారం కుటుంబ సభ్యులతో టౌన్‌కు వచ్చింది. తిరిగి ఇంటికి వెళ్లి చూడగా గుర్తు తెలియని దొంగ ఇంట్లోని బీరువాలో ఉంచిన 7తులాల నగలను అపహరించినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

మైదుకూరు రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన నల్లమారు నాగభూషణం (48) అతిగా మద్యం తాగి డీహైడ్రేషన్‌కు గురై సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నాగభూషణం జీపు డ్రైవర్‌గా పనిచేస్తు మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి అతిగా మద్యం తాగి స్థానిక కడప రోడ్డులో రోడ్డు పక్క నిద్రపోయి.. అక్కడే డిహైడ్రేషన్‌కు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య ఓబులమ్మ ఉన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్.. ముగ్గురు అరెస్టు

వల్లూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఆడుతున్నట్లు సమాచారం రావడంతో తన సిబ్బందితో కలిసి దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... గోటూరు పొలాల సమీపంలో అక్రమంగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కార్యకలాపాలను కొనసాగుతున్నట్లు సమాచారం రావడంతో తన సిబ్బందిని అప్రమత్తం చేసి దాడులు నిర్వ హించామన్నారు. తెలిపారు. ఈ దాడుల్లో ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 18,500 నగదు, రెండు మొబైల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తప్పిపోయిన మహిళ ఆచూకీ లభ్యం



ఆచూకీ లభ్యమైన మహిళను చూపుతున్న ఎస్ఐ తిమోతి

కలసపాడు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ముదిరెడ్డిపల్లె గ్రామా నికి చెందిన షేక్ మస్తాన్ బీబీ అనే మహిళ ఆచూకీ లభించినట్లు ఎస్ఐ తిమోతి తెలిపారు.

ఈనెల 21వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోయి అదృశ్యమైన ఆమె హైదరాబాద్‌లోని బంధువుల వద్ద ఉంటూ అక్కడ పనికి వెళ్తున్నట్లు ఫోన్ ద్వారా గుర్తించామన్నారు. పోసు సిబ్బంది అక్కడకు వెళ్లి ఆమెను తీసుకువచ్చి సోవవారం బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.

చేనేతల సమస్యలపై కలెక్టర్ ఆరా



చేనేత కార్మికులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎమ్మెల్యే ఆది, భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలం గూడెం చెరువు రాజీవ్‌నగర్ కాలనీలోని మోరగుడి చేనేత కాలనీలో సోమవారం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పర్యటించారు.

ఈ సందర్భంగా చేనేత కార్మికుల సమస్యలపై కలెక్టర్ ఆరా తీశారు. ప్రస్తుతం మగ్గాలు నేస్తున్నారా.. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఇందుకు చేనేత కార్మికులు తమకు గుంత మగ్గం ఉందని, తమను చిన్న చూపు చూస్తున్నారని, పనులు అంతంత మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి చేనేతలతో మాట్లాడుతూ గతంలో తాను ఇళ్లు ఇప్పించామని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య బీమా విషయంలో వృద్ధుల అనాసక్తి'

కడప సెవెన్ రోడ్స్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య బీమా పొందేందుకు వృద్ధులు తగినంత శ్రద్ధ చూపించడం లేదని లాన్సెట్ అధ్యయన ప్రధాన రచయిత, ఎల్వీ ప్రసాద్‌నేత్ర వైద్యశాల కన్సల్టెంట్ నేత్ర వైద్యులు డాక్టర్ బ్రిజేష్ టక్కర్, మరో అధ్యయన రచయిత డాక్టర్ రాజ్ నారా యణ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఎల్‌వీపీ ఈఐలో సోమవారం విడుదల చేసిన లాన్సె ట్ పరిశోధన ఫలితాలపై వారు మాట్లా డుతూ భారతదేశంలో క్యాటర్యాక్ట్ (కంటి శుక్లాలు) శస్త్ర చికిత్స చేయించుకున్న ప్రతి 20 మంది వృద్ధులలో కేవలం ముగ్గురు మాత్రమే ఆరోగ్య బీమా కలిగి ఉన్నట్లు ప్రముఖ వైద్య పత్రిక లాన్సెట్ పరిశోధన వెల్లడించిందన్నారు.

ఆరోగ్య బీమా తగినంత కవరేజ్ ఉన్నప్పుడు మాత్రమే మెరుగైన చికిత్సలు ద్వారా మంచి దృష్టి ఫలితాలను అందించేందుకు వీలవుతుందని తమ అధ్యయనం తెలుపుతుందన్నారు. 70ఏళ్ల పైబడిన సాధారణ క్యాటరాక్ట్ శస్త్రచికిత్స చేయించుకున్న దేశంలోని నాలుగు రాష్ట్రాలలో (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, కర్ణాటక) నిర్వహించగా 38,387 మంది రోగులలో కేవలం 16.07శాతం మంది మాత్రమే ఏదోక రకమైన బీమా కవరేజ్ కలిగి ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు.

గండికోట నుంచి 5వేల క్యూసెక్కుల నీరు విడుదల


కొండాపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి సోమవారం 5000 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ఆదివారం 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, సోమవారం 5000 క్యూసెక్కులకు పెంచామన్నారు. మైలవరం రైతుల అవసరాల దృష్ట్యా 2 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్లు ఈఈ తెలిపారు. అదేవిధంగా జీఎన్ఎస్ఎస్ మెయిన్‌కెనాల్‌కు 150 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయిర్‌కు 330 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా 20 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో లేదని ఈఈ తెలిపారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 13.7 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఆయన తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు.

పైడిపాలెం రిజర్వాయర్‌కు...

గండికోట ప్రాజెక్టు నుంచి పైడిపాలెం రిజర్వాయిర్‌కు సోమవారం నీటిని విడుదల చేశారు. గండికోట ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్ వద్ద తుంగభద్ర ప్రాజెక్టు హైలెవల్ కెనాల్ చైర్మెన్ మారెడ్డి జోగిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి మోటర్లు ఆన్‌చేసి నీటిని విడుదల చేశారు. పంప్‌హౌస్ నుంచి మూడు మోటర్ల ద్వారా 330 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల ప్రాంతం రైతుల అవసరాల దృష్ట్యా నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. పులివెందుల నియోజకవర్గంలోని రైతులకు ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జలవనరులశాఖ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



గండికోట పంప్‌హౌస్ వద్ద పూజలు నిర్వహిస్తున్న తుంగభద్రప్రాజెక్టు హైలెవల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి



గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరానికి విడుదలవుతున్న నీళ్లు

బెరైటీస్ మైనింగ్‌ను తనిఖీ చేసిన అధికారులు

వేంపల్లె, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెరైటీస్ మైనింగ్‌లు సోమవారం మైనింగ్, విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మండలంలోని బక్కన్నగారిపల్లె వద్ద నిర్వహిస్తున్న మైనింగ్‌లను పరిశీలించారు. ఇటీవల ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుకు అక్రమ మైనింగ్‌లపై ఫిర్యాదు చేశారు. వేంపల్లె, వేముల మండలాల్లో అనుమతులు,రాయల్టీలు చెల్లించకుండా కోట్ల రూపాయల ముగ్గురాయిని కొల్లగొడుతున్నారని ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా మైనింగ్ అధికారి వెంకటసాయి, విజిలెన్స్ ఏడీ సుబ్రహ్మణ్యం తనిఖీలు చేపట్టారు. వారు మాట్లాడుతూ అక్రమమైనింగ్ నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పట్టుదల, శ్రమతో విజయం సాధ్యం



ఎన్‌సీసీ విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్

కడప ఎడ్యుకేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కఠోరశ్రమ, అలుపెరుగని ప్రయత్నం, పట్టుదల విజేతల విజయ రహస్యమని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ తెలిపారు.జూలై 15 నుంచి 25 వరకు సికింద్రాబాద్‌లో నిర్వహించిన ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంప్‌నకు ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరై అక్కడ నిర్వహించిన వాలీబాల్, కల్చరల్, డ్రిల్, టగ్ ఆఫ్ వార్ వంటి విభాగాలలో ప్రతిభ కనబరచి పతకాలు సాధించడం జరిగింది. సోమవారం వారిని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ అభినందించారు. అందులో భాగంగా కళాశాల ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ డాక్టర్ నీలయ్య మాట్లాడుతూఎన్‌సీసీ క్యాడెట్లు ఈ క్యాంప్‌లో రోజువారి సైనికుల దినచర్యను అనుసరిస్తూ వారు వినియోగించే ఆయుధాలు, కంపాస్, మ్యాప్ వంటి వాటిల్లో శిక్షణ పొందడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ మహేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రమేష్, అధ్యాపకులు డాక్టర్ సుధాకర్‌రెడ్డి, డాక్టర్ పి.రవిశేఖర్, సావిత్రి, శివరాం,క్యాడెట్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యపై అధికారుల చర్యలు



పాలెంపాపయ్య వీధిని పరిశీలిస్తున్న అధికారులు

కడప మారుతీనగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నగర పాలెంపాపయ్య వీధిలో గత కొన్ని సంవత్సరాలుగా తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యను తీర్చేందుకు వీలుగా జిల్లా కలెక్టర్ స్పందించారు. ఇటీవల ఆ ప్రాంత షాపుల యజమానులు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో కార్పొరేషన్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించి సోమవారం పాలెంపాపయ్య వీధికి చేరుకుని ఆ వీధికి కొలతలు వేసి ట్రాఫిక్ సమస్య ఉత్పన్నంకాకుండా మార్కింగ్ వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో వెడల్పుగా వున్న రోడ్డు కాలగమనంలో కుదించుకుపోవడంతో ట్రాఫిక్ సమస్య అధికమైందన్నారు. ముఖ్యంగా వీధిలో కొన్ని వ్యాపార సముదాయాలు, హాస్పిటల్స్ వున్న నేపథ్యంలో భారీ వాహనాల ద్వారా లోడింగ్, అన్‌లోడింగ్‌కు వాహనాలు, అంబులెన్స్‌లు రాకపోకలు చేయాల్సివస్తోందన్నారు. దీంతో ఆ ప్రాంతంలో రాకపోకలు సాగించే ద్విచక్రవాహన దారులు, పాదచారులకు ఇబ్బందికరంగా వుందన్నారు.

ఎంపీడీవోగా కెజియా



కమలాపురం రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : కమలాపురం ఎంపీడీవోగా మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎల్.కెజియా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఖాదర్‌బాషా శిక్షణ నిమిత్తం సెలవుపై వెళ్లారు. ఆ స్థానంలో కెజియాను పూర్తి అదనపు బాధ్యతల ఎంపీడీవోగా నియమించారు. కెజియాను ఎంపీపీ గండి భారతి, భాస్కర్, మాజీ సర్పంచులు నాగిరెడ్డి, జనార్దనరెడ్డి, గుజ్జుల నారాయణ సన్మానించారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి







కడప, చెన్నూరులో పుట్ట, వేంపల్లిలో నాగులుకు ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

వేంపల్లె, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నాగులచవితి పర్వదినాన్ని వేంపల్లెలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేంపల్లెలోని సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సతీసమేత సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక అలంకరణ గావించారు. భక్తులు పుట్టకు పాలుపోసి మొక్కుకున్నారు. ఉపవాసంతో నాగదేవతలకు పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల కోసం ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించారు. భక్తుల సందర్శనతో ఆలయం కిక్కిరిసిపోయింది.

చెన్నూరు..: నాగులచవితి పండుగను మండల వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయమే గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల్లో ఉన్న పుట్టల వద్దకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. పసుపు, కుంకుమ, పూలు పండ్లతో పాటు పసుపు దారాలను పుట్టలచుట్టూ అల్లి కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు పుట్టల్లో పాలు పోసి తమ కుటుంబాలు చల్లగా చూడాలంటూ నాగులను వేడుకున్నారు.

సీకేదిన్నె..: చింతకొమ్మదిన్నె మండలంలో నాగులచవితి వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసంలో వచ్చే నాగులచవితి పండుగను మహిళలు సాంప్రదాయబద్ధంగా పుట్టకు పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి ఉపవాసాలు ఉన్నారు. పుట్టలో పాలుపోసి నాగేంద్రునికి పూజలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నాగులచవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు.





కడపలో పుట్టను అలంకరిస్తున్న మహిళలు, సీకేదిన్నెలో అలంకరించిన నాగప్రతిమలు

రేపు బహిరంగ వేలం

సీకేదిన్నె, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గంగమ్మ ఆలయం వద్ద 30వ తేదీ ఉదయం 10.30 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో కృష్ణానాయక్ తెలిపారు. దేవస్థానం ఆవరణలో భక్తులకు షామియానాలు, వంటసామగ్రి, కుర్చీలు, టేబుళ్లకు రూ.50 వేలు డిపాజిట్, కూల్‌డ్రింక్ షాపు, చల్లనిపానీయాలు పెట్టుకునేందుకు రూ.20 వేలు, పూలు, పూలదండలు, గాజులు, పూలసామగ్రికి రూ.20 వేలు, పాదరక్షల స్టాండుకు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని అన్నారు. ఈ వేలంపాట లీజు కాలం 1.8.2025 నుంచి 31.7.2026 వరకు వర్తిస్తుందన్నారు. పాట ముగిసిన వెంటనే హెచ్చు పాటదారులు ధరావత్తు తప్ప మిగిలినవారికి డిపాజిట్ వెంటనే వాపస్ ఇవ్వబడునన్నారు. పాట దక్కించుకున్నవారు డిపాజిట్‌తో కలిపి సగం అమౌంట్ చెల్లించి రశీదు తీసుకోవాలన్నారు. మరింత సమాచారానికి ఈవోను సంప్రదించాలన్నారు.

రైతాంగాన్ని ఆదుకోండి

వీరపునాయునిపల్లె, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతు పరిస్థితి దయనీయంగాఉందని తక్షణం ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఐదారు సంవత్సరాలుగా వర్షాభావంతో రైతాంగం పరిస్థితి మరింత ఘోరంగా ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం దాటినా ఇప్పటి వరకు గత ఖరీఫ్ సీజన్ సంబంధించి నపంటల బీమా మంజూరులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు.

ఈవీఎంలతో ఎన్నికలు రద్దు చేయాలి

కడప కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఈవీఎంలతో ఎన్నికలు నిర్వహించి కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏక పక్షంగా లబ్ధి పొందుతోందని, ఈవీఎంలతో ఎన్నికల విధానాన్ని రద్దు చేయాలని రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సంగటి మనోహర్ కేంద్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్‌చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆవరణంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలతో కలసి ఈవీఎంలు రద్దు- బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు ముద్దంటూ నిరసనకు దిగారు. అనంతరం రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలతో కలసి కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ అమీన్‌పీరా, సగిలి గుర్రప్ప, వెంకట శివ, జేవీరమణ, మహబూబ్ బాష, కైపు రామాంజనేయులు, శ్రీనివాసులు, సీఆర్వీ ప్రసాద్, దేవరశ్రీకృష్ణ, ఓబులేసు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దుచేయాలి'



వామపక్ష సంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ దృశ్యం

కడప సెవెన్‌రోడ్స్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని పెంచిన ఇంధన సర్దుబాటు చార్జీలు ఉపసంహరించుకోవాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం కడప ఐటీఐ సర్కిల్‌లో సంతకాల సేకరణ నిర్వహించారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు బి.మనోహర్ మాట్లాడుతూరాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారాన్ని తక్షణం ఆపకపోతే పెద్దఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. టైం ఆఫ్ డేటార్ఫ్ విధానాన్ని చిరువ్యాపారులకు సైతం అమలు చేస్తామని ప్రకటించడం దారుణమన్నారు. రోజువారీ డిమాండ్‌ను బట్టి చార్జీలు విధించే ఈ విధానాన్ని రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేయడానికి ఈఆర్సీ అనుమతించడం దారుణమన్నారు. సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

పీ4 కార్యక్రమం నిర్బంధం సరికాదు

యూటీఎఫ్

కడప ఎడ్యుకేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జీఓ పావర్టీ (పీ-4) కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థి కుటుంబాలను తప్పనిసరిగా దత్తత తీసుకోవాలంటూ విద్యాశాఖ అధికారులు నిర్బంధం చేయడానికి యూటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు తెలిపారు.సోమవారం కడప నగరం యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారుమాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలన పేరుతో ముఖ్యమంత్రి ప్రారంభించిన ఈ పీ-4 కార్యక్రమంలో సంపన్నులు ముందుకు వచ్చి పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలన్నారు. అయితే ముఖ్యమంత్రి చేపట్టిన కార్యక్రమానికి పెద్దగా స్పందన రాకపోవడంతో ఇపుడు ఆ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులపై నెడుతున్నారన్నారు. ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సివి రమణ, ఏజాస్ అహమ్మద్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వానపాముల ఎరువు మంచి భూసారం



ఎస్‌డబ్ల్యూపీసీలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన వర్మీకంపోస్టు ఎరువు

చెన్నూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : రైతులు వానపాముల ఎరువు వాడడం వల్ల భూసారం పెరిగి పంటలు బాగుంటాయని, అదే సమయంలో పండ్ల మొక్కలు, కూరగాయల మొక్కలకు వేసినా అవి సారవంతంగా పెరుగుతాయని డిప్యూటీ ఎంపీడీవో సురేశ్‌బాబు అన్నారు. చెన్నూరు ఎస్‌డబ్ల్యూపీసీలో 250కిలోల ఎరువును కిలో రూ.10 వంతున కొండపేట గ్రామ సర్పంచ్ తుంగ చంద్రయాదవ్‌కు పంట పొలం కోసం విక్రయించారు. అలాగే రోజూ వానపాముల ఎరువు రైతుల కోసం అందిస్తామని ఆయన అన్నారు. అలాగే పలువురు రైతులు ఎస్‌డబ్ల్యూపీసీ వద్దకు రాగా వారికి అందించేందుకు వానపాముల ఎరువులు సిద్ధం చేసినట్లు డిప్యూటీ ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటసుబ్బయ్య, కార్యదర్శి రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు గ్రిల్ ఏర్పాటు



చెన్నూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు బాలుర ఉన్నత పాఠశాలలో చదివిన మునగపాటి చంద్రశేఖర్ ప్రస్తుతం లక్నోలో కెనరా బ్యాంకు ఏజీఎంగా పనిచేస్తూ తాను చదివిన పాఠశాలకు గుర్తుగా లక్షన్నర రూపాయలతో గ్రిల్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదివిన పాఠశాలకు తన వంతుగా చిన్నపాటి సహాయంగా గ్రిల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ఎంఈవో గంగిరెడ్డి మాట్లాడుతూ బాలుర ఉన్నత పాఠశాలలో గ్రిల్ ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు కూడా రక్షణ ఏర్పడిందన్నారు. కాగా విషయాన్ని జనసేన నేత శివకుమార్ దృష్టికి తీసుకుపోగా ఆయన తన మిత్రుడు, బ్యాంకు మేనేజరుకు విషయం తెలిపి గ్రిల్ ఏర్పాటు చేయించారు. అలాగే జనసేన నేత 11,500 రూపాయలతో 2వేల లీటర్ల నీటి ట్యాంకును పాఠశాల కోసం వితరణ చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వంటశాలను పరిశీలిస్తున్న బాబాఫక్రుద్దీన్

సీకేదిన్నె, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సెక్రటరీ, సీనియర్ సివిల్‌జడ్జి బాబాఫక్రుద్దీన్ తెలిపారు. మండలంలోని ప్రకాశంపల్లెలోగల ఆశా నిలయాన్ని సోమవారం సందర్శించి న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని జీవన పరిస్థితులు, భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రతపై, మౌలిక సదుపాయాలపై శ్రద్ధ చూపాలన్నారు. క్రమశిక్షతో కూడిన విలువైన విద్యను విద్యార్థులకు అందించాలన్నారు. అదే విధంగా పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయం హెల్ప్‌లైన్ నంబరు ఇచ్చి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్లకు పెండింగ్‌లో ఉన్న జీతాలు విడుదల చేయాలి

కడప ఎర్రముక్కపల్లె, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కడపనగరపాలక సంస్థ పరిధిలో ఉండే ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్ వర్కర్లకు మూడు నెలల పెండింగ్ వేతనాలు తక్షణం చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్లా, నగర అధ్యక్షుడు పి.సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. సోమవారం కడప కార్పొరేషన్‌లో మేయర్ సురేష్‌బాబుకు అడిషనల్ కమిషనర్ రాకేష్‌చంద్రకు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు నాగరత్నమ్మ, షేక్ సున్నీష, జకియా, జరీనా, సాహిన, అక్బరున్నీసా పాల్గొన్నారు.

స్తంభాన్ని ఢీకొన్న సుమో...తప్పిన ప్రమాదం

పులివెందుల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత గంగిరెడ్డి హాస్పిటల్ ప్రాంత సమీపంలో కరెంట్‌పోల్‌ను సుమో ఢీకొట్టిన సంఘటన సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన పెళ్లికి హాజరై తిరిగి వెళ్తున్న సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. అక్కడున్న స్పీడ్ బ్రేకర్‌ను దాటగానే సుమో స్టీరింగ్ పనిచేయకపోవడంతో కరెంటు పోల్‌ను ఢీకొట్టినట్లు అందులో ప్రయాణిస్తున్న వారు తెలిపారు. సుమోలో సుమారు పదిమంది ఉన్నారు. పోల్‌ను ఢీకొట్టగానే అప్రమత్తమై వెంటనే వారు సుమో నుంచి దిగిపోయారు. దీంతో పెనుప్రమాదమే తప్పింది.

కమలాపురం ఎన్జీవో ఎన్నికలు ఏకగ్రీవం

కమలాపురం రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : కమలాపురం తాలుకా ఏపీ ఎన్జీవో యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవం అయినట్లు ఆ సంఘం అధ్యక్షుడు వెంకటరత్నం తెలిపారు. సోమవారం నిర్వహించిన ఎన్జీవో సంఘం ఎన్నికలకు అధికారిగా నరేంద్ర, సహాయ ఎన్నికల అధికారి పోల్‌రెడ్డి, పరిశీలకుడుగా డి.రవికుమార్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు వ్యవహరించారు. వీరి ఆధ్వర్యంలో స్థానిక ఏపీ ఎన్జీవో కార్యాలయం నందు కమలాపురం తాలుకా యూనిట్ ఎన్నికలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్‌యాదవ్ హాజరయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏపీ ఎన్జీవో కమలాపురం నియోజకవర్గం నూతన అధ్యక్షుడిగా వెంకటరత్నం, ఉపాధ్యక్షులు గా శ్రీనివాసులు, వెంక టేశ్వర్లు, కొండారెడ్డి, వసంత, పవన్‌కుమార్, కార్యదర్శిగా వెంకట సుబ్బయ్య, సహాయకార్య దర్శులుగా సాదిక్, షరీఫ్, నాగమునిరెడ్డి, మునిక్రిష్ణయ్య, రెడ్డి తులసి, కోశాధికారిగా లక్ష్మయ్య ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

జూదరుల అరెస్టు

పులివెందుల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలంలోని కోరవానిపల్లె గ్రామంలో జూదమాడుతున్న ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఘనమద్దిలేటి తెలిపారు. అందిన సమాచారం మేరకు కోరవానిపల్లెలోని ఓ ఇంటిపై దాడులు చేశామన్నారు. ఈదాడిలో ఐదుగురిని అరెస్టుచేసి వారి నుంచి రూ.7500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గొట్లమెట్లలో పట్టపగలు చోరీ

చక్రాయపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లమెట్ల గ్రామంలో సోమవారం పట్టపగలుచోరీ జరిగింది. గొట్లమెట్లకు చెందిన సత్యనారాయణరెడ్డి, గంగమ్మ ఉదయం 11గంటల సమయంలో గొర్రెలను తోలుకొని అడవికి పోయారు. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తలుపువద్ద పడి ఉన్న కడ్డీలు తాళాన్ని చూసి అనుమానంతో ఇంట్లోకి వెళ్లిచూడగా రెండు జతల బంగారు కమ్మలు, జాలర్లు, ఉంగరం, రూ.4వేలు నగదు దొంగలు తీసుకెళ్లినట్లుగుర్తించారు. ఈ విషయాన్ని సర్పంచు మల్‌రెడ్డి పోలీసులకు

మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

కడప సెవెన్ రోడ్స్ జూలై 28 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో వంట ఏజెన్సీ కార్మికులుగా పనిచేస్తున్న వారికి కనీస వేతనాలు, నైట్‌వాచ్‌మెన్‌లకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలు తక్షణమే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి కోరారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్లా, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు చాంద్‌బాష, కార్యదర్శి సులోచనమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు ఆటంకం కలిగించకుండా ఏరోజూ వంట ఆపకుండా మెనూలో ఉండే కూరలతో కోడిగుడ్డుతో సక్రమంగా చేసిన తమను ప్రభుత్వ కార్మికులుగా గుర్తిస్తారని, జీతాలు పెంచుతారని ఆశతో ఎదురుచూస్తున్నారన్నారు. నైట్‌వాచ్‌మెన్‌లకు ఐదు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, మధ్యాహ్న భోజన పథకం యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

ఎరువుల కొరత తీర్చాలి



రైతు సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కడప సెవెన్ రోడ్స్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువుల కొరతను తీర్చాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం రైతు సంఘం నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎంవీ సుబ్బారెడ్డి, పోతిరెడ్డి భాస్కర్ మాట్లాడుతూ జిల్లాలో ఎరువుల కొరత, కృత్రిమ కొరతతో రైతులుచాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నో సమస్యలను అధిగమించి ఈరోజులలో రైతులు వ్యవసాయం చేస్తున్నారన్నారు. రైతులకు తగినంత ఎరువులను అందించకపోవడం వల్ల కొంతమంది ఎరువుల దుకాణదారులు కృత్రిమ కొరతనుసృష్టించి అధిక ధరలకు ఎరువులను రైతులకు అమ్ముతున్నారన్నారు. రైతులకు ఎరువులను సరఫరాచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం, జిల్లా సమితి సభ్యులలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రొద్దుటూరు ,జూలై 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక టీ డీపీ కార్యాలయంలో 31 మంది బాధితులకు రూ.40.21 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి సోమవారం పంపిణీ చేశారు. అనారోగ్యాలతో చికిత్సలు చేయించుకుని ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నవారికి ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు రసూల్ గౌస్ పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమించారని ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కలసపాడు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కలసపాడులోని కోనేరు వీధికి చెందిన ప్రజలు తమ దారిని నారాయణ అనే వ్యక్తి ఆక్రమించాడని సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. 231 సర్వేనెంబర్ కోనేరు బావికి చెందినదని ఇక్కడ రోడ్డు వేస్తుంటే అడ్డుకొని తనదని నకిలీ పత్రాలుచూపుతున్నాడని వారు తెలిపారు. ఎంపీడీఓ, తహసీల్దార్ దృష్టికి తీసుకుపోగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జకరయ్య, గురయ్య, నాగూర్‌వలి, హుస్సేన్‌పీనా, వీధి ప్రజలు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ నూతన కమిటీ ఎంపిక

బద్వేలు రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌ఎఫ్‌ఐ నూతన కమిటీని సోమవారం ఏర్పాటు చేశామని జిల్లాకార్యదర్శి వీర పోగు రవి అన్నారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా శ్రీనివాసులు, సుశాంత్, పట్టణ ఉపాధ్యక్షులుగా సుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, చరణ్, సహాయ కార్యదర్శులుగా రామక్రిష్ణ, సూర్య, గోవర్ధన్, సురేశ్, మరో 14 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్న ట్లు తెలిపారు.

తీరుమారదు.. శుభ్రత కనిపించదు



ఖాజీపేట నుంచి కాశినాయన వెళ్లే రోడ్డు పక్కనే పేరుకుపోయిన చెత్తకుప్పలు

ఖాజీపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ప్రతినెలా మూడవ శనివారం నిర్వహిస్తున్నా కొన్ని చోట్ల అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. గ్రామాలు, పట్టణాల్లో సైతం పరిశుభ్రత పెంపొందించాలని ప్రభుత్వం పేర్కొంటున్నా మరెందుకో వాటిపై కొందరు నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండడం శోచనీయం ఖాజీపేట మండలంలోని ప్రతి పంచాయతీలో చెత్తనుంచి సంపద కేంద్రాలు ఏర్పాటు చేసి తడి, పొడి చెత్తలను సేకరించి హరిత రాయబారులు వాటిలో చేర్చాల్సి ఉంటుంది. అందుకు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసింది. అయితే రోడ్డు పక్కనే చెత్తకుప్పలు ఇష్టానుసారంగా కుప్పలుగా పేరుకుపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇదేమిటి రోడ్డు పక్కన చెత్త పడవేస్తే అంటు వ్యాధులు రావా అని ప్రజలు సిబ్బందిని ప్రశ్నిస్తే మాకు తెలియదు, అధికారులు మాకు చెప్పారు ఎక్కడైనా వేస్తామంటూ సమాధానమిస్తుండడంతో అవాక్కవుతున్నారు. ఏది ఏమైనా ఇలా చెత్తకుప్పలు పెరిగితే వర్షాకాలంలో అవి కుళ్లి అంటు రోగాలు ప్రబలితే వ్యాధులు రావా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ప్రజలు కోరతున్నారు.

చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలిస్తాం

పారిశుధ్యాన్ని మెరుగుపరచే కార్యక్రమంలో భాగంగా ఇళ్ల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలిస్తామన్నారు. ఎవరూ కూడా రోడ్డు పక్కన చెత్తను పడవేయరాదని అలాచేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

-శంకరమ్మ, పంచాయతీ కార్యదర్శి, ఖాజీపేట

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



సుపరిపాలనలో తొలి అడుగులో డీసీసీబీ ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డి

అట్లూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని డీసీసీ బ్యాంకు ఛైర్మన్ మంచూరి సూర్యనారాయణరెడ్డి, బద్వేలు అబ్జర్వర్‌నాగేంద్ర బాబు, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లిఖార్జునరెడ్డి తెలిపారు. మండలంలోని ఎస్.వెంకటాపురంలో సోమవారం సుపరిపాలనలో ఇంటింటి కార్యక్రమంలోకూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు అరవ శ్రీనివాసులరెడ్డి, రెడ్డయ్య, రాజశేఖర్‌రెడ్డి, పరశురాం, క్రిష్ణారెడ్డి, సొసైటీ డైరెక్టరురాధాక్రిష్ణరెడ్డి, పెదరామసుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగు

ఖాజీపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు చదువుకుంటే ఆ ఇంటికి వెలుగు నింపుతుందని జీసీడీవో రూత్ ఆరోగ్యమేరీ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కేజీబీవీని పరిశీలించారు. ఈసందర్భంగా స్కూల్ క్లాస్ రూములను, వంట గదిని, బాత్‌రూములను పరిశీలించి పిల్లల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆగస్టు నెలలో నిర్వహించే ఎఫ్ఏ-1 పరీక్షలు సిలబస్ విద్యార్థులకు అందించాలన్నారు. అలాగే ప్రభుత్వం అందించే మెనూ ప్రకారం పిల్లలకు భోజనం ఇవ్వాలని, పిల్లలకు ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. పిల్లల తల్లిదండ్రులు వారి పిల్లలను మనకు అప్పగించడం జరిగిందని, వారిని తీర్చిదిద్ది ఉన్నత శిఖరాలను అధిరోహించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బార్గవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు



పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు టౌన్/ముద్దనూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి పండు గను పురష్కరించుకుని పట్టణంలోని పుట్టలు, ఆలయాల్లోని నాగుల కట్టల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం పుట్టవీధిలో పుట్టవద్ద, శివాలయం, రామేశ్వరం, రాజరాజేశ్వరిదేవి ఆలయం, రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలలో నాగదేవత విగ్రహాల వద్ద పాలు పోయడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. పుట్టకు దారం చుట్టి చలిపిండి, నువ్వుల పిండి సమర్పించి చీరెలు సమర్పించారు. ముద్దనూరు మండలంలో నాగుల చవితి వేడుకలను సోమవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఒక్క పొద్దులు ఉన్న భక్తులు పుట్టల వద్దకు వెళ్లి పాలు,వడపప్పు, చలిపిండి, నువ్వుల పిండి సమర్పించారు.

మైదుకూరు రూరల్‌లో : మైదుకూరు మున్సిపాలిటీ,మండలంలో నాగులచవితి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. తెల్లవారుజామునుంచే దగ్గలోని పుట్టల వద్ద మహిళలు పెద్ద ఎత్తున చేరుకొని పూజలు నిర్వహించారు.

ఖాజీపేటలో: నాగులచవితి పండుగను మండల పరిధిలోని మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సోమవారం ఉదయం నుంచి ఉపవాసం ఉండి పుట్టకు పూజలు చేశారు.

రాజుపాలెంలో: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సోమవారం నాగులచవితి పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి గ్రామాల్లోని పంట పొలాల్లో ఉన్న పుట్టల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

బద్వేలు, జూలై 28(ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు చర్యలు చేపట్టాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి నరసింహారెడ్డి పేర్కొన్నారు. సోమవారం సామాజిక ఆరోగ్యకేంద్రం నందు డెంగ్యూ మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆయన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు చరణ్, శరత్‌చంద్ర, భరత్,తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి మించిన సంపద లేదు

ప్రొద్దుటూరు రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి మించిన సంపద లేదని ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంపై దృష్టి సారించాలని కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ కాలేయ వ్యాధి దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని కామనూరు, ఉప్పాగు, గోపవరం, హౌసింగ్‌బోర్డు కాలనీ, ఆచార్యుల కాలనీ, ప్రాంతాల్లో అవగాహన ర్యాలీలు చేపట్టారు.

జాతీయ వినియోగదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సురేశ్‌బాబు



సురేశ్‌బాబుకు నియామకం పత్రం అందిస్తున్న కన్జూమర్ ఫోరం నాయకులు

బద్వేలు రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ వినియోగదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన మద్దెల సురేశ్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ఛైర్మన్ కిశోర్ తెలిపారు. ఆ సంస్థ జాతీయ ఛైర్మన్ సాయి రమేశ్ ఆదేశాల మేరకు సురేశ్‌బా బును ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఐడెంటిటి కార్డు, అపాయింట్‌మెంటు లెటరు, మెంబ ర్‌షిప్ సర్టిఫికెట్‌ను జిల్లా ఛైర్మన్ అందించారు. ఈ సందర్భంగా సురేశ్‌బాబు మాట్లాడుతూ తనను ఎన్నుకున్న జాతీయ ఛైర్మన్ డాక్టర్ సాయిరమేశ్‌కు, రాష్ట్ర కో-ఆర్డినేటరు మద్దెల సురేశ్‌బాబు, జిల్లా వైస్‌ఛైర్మన్ సీవీ సుబ్బారెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఉమామహేశ్వ ర్‌రావు, సుబ్బారావు, చలపతి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి



మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రొద్దుటూరు అర్బన్ జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని 16వ వార్డు మోడంపల్లె మాదిగ కాలనీల్లో వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ దళిత సమాఖ్య, రాష్ట్ర మా లమహానాడు నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించారు. ఆంధ్రప్రదేశ్ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లె ఎల్లయ్య, రాష్ట్ర మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య మాట్లాడుతూ కొత్తపల్లి పబ్లిక్ కాలువ వరకు సిమెంట్ రోడ్డు మున్సిపాలిటీ వారు నిర్మించారని ఆ రోడ్డుకు సైడ్ కాలువలు నిర్మించి మురుగు నీరు కొత్తపల్లి కాలువలోకి కలపాలని అనేకమార్లు మున్సిపల్ కమిషనర్‌ను కలసి విన్నవించామని తెలిపారు. ఈ నెల 23న కాంట్రాక్టర్ సైడ్ కాలువలు నిర్మించుటకు మొదలుపెట్టిన పనులను కొంతమంది అగ్రకులస్థులు అడ్డుకున్నారని తెలిపారు. మాదిగ కాలనీ మురుగు నీరు కొత్తపల్లి కాలువలో కలపొద్దని అధికారులు సైడ్ కాలువ పనులు వెంటనే చేపట్టి మురుగునీరు తొలిగేలా చేయాలని వారు కమిషనర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో ఆనంద్, నాగేంద్ర, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పుట్టా పై విమర్శలు తగదు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం ఇడమడక నేషనల్ హైవేపై ప్రమాదకరంగా ఉన్న డాబాలను అధికారులు తొలగిస్తే ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌పై విమర్శలు చేయడం తగదని తెలుగుదేశం పార్టీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి తాటి శ్రీనివాసులుయాదవ్ పేర్కొన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో డాబాలను ఏర్పాటు చేశారని ఆ డాబాల వలన రోడ్డు ప్రమాదంలో సంవత్సరానికి అయిదారుగురు మరణిస్తున్నారని తెలిపారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో స్పందించిన రెవెన్యూ, నేషనల్ హైవే, కేసీకెనాల్ అధికారులు, దేవాదాయశాఖ అధికారులు నోటీసులు ఇచ్చి డాబాను తొలగించారన్నారు. ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, ఆయనపై కులముద్ర వేసి చిన్నచూపు చూడడం తగదన్నారు. మాజీ ఎమ్మెల్యే అవినీతి చిట్టా తమ వద్ద ఉందని, వాటిని బయటపెడుతామని పేర్కొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

బి.కోడూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బి.కోడూరు హైస్కూలులో విద్యార్థులకు వైద్యాధికారి హుసేనయ్య ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. 72 మంది విద్యార్థినులు, 53 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అందులో 18 మందికి కంటి చూపు లోపం ఉన్నదని, వారికి కంటి అద్దాలు అందించేందుకు ఉన్నతాధికారులకు తెలిపామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేశ్, హెల్త్ సూపర్‌వైజరు జాన్‌వలియం, ఎఎన్ఎం భారతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు భూములు పంచాలి

కాశినాయన జూలై28(ఆంధ్రజ్యోతి)నాయనపల్లె గ్రామసమీపంలో ఆక్రమణదారుల నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూమిని అర్హులైన పేదలకు పంచాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుగు అన్వేష్ పేర్కొన్నారు.సోమవారం నర్సాపురం తహసీల్దారు కార్యాలయం వద్ద వారు ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దరు రవిశంకర్‌కు వినతిపత్రం అందజేశారు కార్యక్రమంలో సంఘం నాయకులు పోలయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో తాగునీటి సమస్యకు చెక్

మైదుకూరు రూరల్, జులై 28(ఆంధ్రజ్యోతి) : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 15 వ వార్డులో తాగునీటి సమస్యలను అధికారులు ఎమ్మెల్యే పుట్టాసుధాకర్‌యాదవ్ ఆదేశాలతో సోమవారం పరిష్కరించారు. వార్డులో బోరు చెడిపోయిందని స్థానికులు అధికారులకు తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే బోరు రిపేరు చేయించడం జరిగింది. అంతేకాకుండా టీడీపీ యూనిట్ ఇన్‌చార్జ్ తుపాకుల వెంకటరమణ దగ్గరుండి పనులు చేయించి నీటిని వదలడం జరిగింది.

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రొద్దుటూరు టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన శ్రీ వేజా నర్సింగ్ హోం ఏర్పాటు చేసి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. సోమవారం ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ పి.సువర్ణ, కుటుంబ సభ్యులు మహిళలకు చీరెలు, పురుషులకు పంచెలు, టవళ్లు అందజేశారు. అలాగే ఆస్పత్రికి వచ్చిన రోగులు, వారి బంధువులకు 300 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పోలీసు కళాజాగృతి బృందం ఓ యువత మేలుకో పేరుతో శ్రీ విద్యా జూనియర్ కళాశాలలో ఆయన మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని దీని వలన శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడమేకాక ఉజ్వల భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. ఎస్ఐ వెంకటరెడ్డి పాల్గొన్నారు. పోలీసు కళాజాగృతి బృందం ప్రదర్శించిన నాటకాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి.

రైతు సేవాకేంద్రాలలో సమృద్ధిగా యూరియా



ఈపాస్ యంత్రంలో వివరాలు పరిశీలిస్తున్న ఏడీఏ అనిత

ప్రొద్దుటూరు రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు డివిజన్‌లోని అన్ని రైతు సేవాకేంద్రాలలో ఖరీఫ్ సీజన్‌కు సరిపడ యూరియాను అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు అనిత పేర్కొన్నారు. ప్రొద్దుటూరులోని మహాలక్ష్మి ఫర్టిలైజర్స్ దుకాణంపై రైతుల నుంచి ఫిర్యాదులు వస్తుండడంతో ఆమె తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగ్ ఈపాస్ యంత్రంలోని వివరాలతోపాటు అక్కడి రికార్డులను పరిశీలించారు. ఎరువులను ఎమ్మార్పీకే అమ్మాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికి ప్రొద్దుటూరు మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో 25.8 మెట్రిక్ టన్నుల యూరియా లభ్యతలో ఉందన్నారు. జమ్మలమడుగు మండలంలో 49.5 టన్నులు, పెద్దముడియం మండలంలో 29.7 టన్నులు, మైలవరం మండలంలో 19.8 టన్నులు యూరియా అందుబాటులో ఉంచామన్నారు. మరో రెండు రోజుల్లో జమ్మలమడుగు మండలానికి 60 మెట్రిక్ టన్నులు, ప్రొద్దుటూరు మండలానికి 20, మైలవరం మండలానికి 20, అలాగే ప్రొద్దుటూరులోని చౌటపల్లి రైతు సేవాకేంద్రానికి 10 మెట్రిక్ టన్నులు, పెద్దశెట్టిపల్లె రైతు సేవాకేంద్రానికి 10 మెట్రిక్ టన్నుల చొప్పున యూరియా సరఫరా కానుందని వివరించారు. రైతులు తొందరపడి యూరియాను కొనుగోలు చేసి నిలువ ఉంచుకోవద్దన్నారు. నిలువ చేసిన యూరియాలో తేమశాతం చేరి గడ్డకట్టం, యూరియా ఆవిరవుతుందని చెప్పారు. ఎప్పటికప్పుడు రైతులు కొనుగోలు చేసి పొలానికి చల్లుకోవాలని సూచించారు.

దువ్వూరులో: దువ్వూరులోని రైతు సేవాకేంద్రానికి సోమవారం యూరియా చేరింది. ఇక్కడికి లారీలో వచ్చిన లోడు 10 టన్నులు దింపారు. మరో 10 టన్నుల యూరియాను నీలాపురంకు తరలించి అక్కడ రైతులకు అందజేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. మరో 220 బస్తాల యూరియా కూడా కేసీ ఆయకట్టు రైతులకు రానున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఎమ్మార్పీకే ఎరువులను విక్రయించాలి

పోరుమామిళ్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి ఎరువులనైనా ఎమ్మార్పీకే విక్రయించాలని సహాయ వ్యవసాయ సంచాలకుడు మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పోరుమామిళ్ల వ్యవసాయ కార్యాలయంలో డీలర్ల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఏవో చంద్రమోహన్ రెడ్డితో కలిసి మాట్లాడుతూ ఎరువులకు సం బంధించి రైతులకు తప్పకుండా రసీదు ఇవ్వాలన్నారు. రైతులు అడిగిన ఎరువులు మాత్రమే ఇవ్వాలని, కృత్రిమ కొరత సృష్టించకుండా ఎరువులు అందుబాటులో ఉంచుకో వాలన్నారు. స్టాకు వివరాలు తప్పక ప్రదర్శించాలని, స్టాకు వివరాలు 15 రోజులకు ఒక సారి సమర్పించాలన్నారు. పోరుమామిళ్లలోని నాలుగు రైతుసేవా కేంద్రాలకు 40 టన్నుల యూరియా మంజూరైందని, అవసరం ఉన్న రైతులు టేకూరుపేట, సిద్దవరం, అక్కు లొరెడ్డిపల్లె, కవలకుంట్ల రైతు సేవా కేంద్రాల్లో పొందవచ్చన్నారు.

అన్న నుంచి రావాల్సిన వాటా ఆస్తిని ఇప్పించండి

- ఆర్డీవోకు దివ్యాంగ బాధితుడి వినతి



ఏవోకు వినతి పత్రం అందజేస్తున్న దివ్యాంగుడు వెంకటరమణ

జమ్మలమడుగు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తాను దివ్యాంగుడినని పెళ్లి చేసుకున్నానని ఆస్తి ఇవ్వకుండా తనకు ధర్మాపురం గ్రామంలోకి రానివ్వకుండా తన అన్న ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఎస్.వెంకటరమణ అనే దివ్యాంగుడు వాపోయాడు. తనకు గ్రామంలో ఇల్లు, భూమి ఇవ్వలేదన్నారు. నాలుగు సంవత్సరాలుగా గ్రామ పెద్దలతో చెప్పించినా పలుకలేదని దౌర్జన్యం చేస్తున్నాడని వాపోయాడు. ఆ మేరకు సోమవా రం బాదితుడు వెంకటరమణ తన భార్యతో కలిసి జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయానికి వచ్చి ఆర్డీవో సాయిశ్రీ లేకపోవడంతో ఏవో ఇక్బాల్‌కు వినతి పత్రం అందజేశారు. అధికారులు తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జమ్మలమడుగు పట్టణానికి చెందిన మహేంద్రకర్, భాగ్యలక్ష్మీబాయీ వితంతు పింఛన్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. మరికొందరు వివిధ భూ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు మహబూబ్‌బాష, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించుకోకపోతే ఆందోళనలు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

బద్వేలు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు తగ్గించుకోకపోతే ఆందోళనలు చేపడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో విద్యుత్ చార్జీల వ్యతిరేకత, ప్రజా ఐక్యవేదిక అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా స్మార్ట్ మీటర్ల పేరుతో యూనిట్ కరెంటు రూ.2.10లు నుంచి రూ.7లు వరకు పెంచి ఆదానికి లాభం చేకూరుస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో దాదాపు 2కోట్ల స్మార్ట్‌మీటర్లు బిగించబోతున్నారని ఆయన తెలిపారు. విద్యుత్ భారాలను విరమించుకోకపోతే అన్ని సంఘాల నేతలను కలుపుకుని రాజకీయాలకతీతంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, పలు సంఘాల నాయకులు గురుమూర్తి, శ్రీనివాసులరెడ్డి, పిచ్చయ్య, మీసాలరవి, ఉస్మాన్, వెంకటేష్, సుబ్బరాయుడు, చాంద్‌బాష తదితరులు పాల్గొన్నారు.

నారుదొడ్ల తయారీలో కేసీ రైతులు



కేసీ ఆయకట్టులో వరి పులక జల్లుతున్న రైతు

దువ్వూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలంలోని కేసీ ఆయకట్టు పరిధిలో నారుదొడ్ల తయారీలో రైతులు నిమగ్నమయ్యారు. నారు పెంపకం కోసం వడ్లను నానబెట్టి చల్లకం చేస్తున్నారు. దీంతో విత్తన వడ్లకు గిరాకీ పెరిగింది. మూల విత్తనాలను ప్యాకెట్ల రూపంలో వ్యాపారులు విక్రయిస్తున్నారు. వాటిని కొనుగోలు చేసి పొలంలో తయారు చేసిన దొడ్డిలో జల్లుతున్నారు. కొందరు ముందే సేకరించుకున్న వడ్లనే వాడుతున్నారు. కేసీ ఆయకట్టులోని పొలాల్లోకి నీరు అందుతుండడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. విత్తన వడ్ల విషయంలో రైతులు జాగ్రత్తపడాలని ప్యాకెట్లు కొనుగోలు చేసే రైతులు వ్యాపారుల వద్ద నుంచి బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని అధికారులు చూచిస్తున్నారు.

ఎమ్మెల్యే వరదకు జనసేన నాయకుల పరామర్శ



ప్రొద్దుటూరు టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బైపాస్ సర్జరీ చేయించుకున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని జనసేన పార్టీ నాయకులు పరామర్శించారు. సోమవారం కామనూరులో ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకుడు మాదాసు మురళి మాట్లాడుతూ ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. వీరైనంత త్వరగా ప్రజాజీవితంలో మమేకం కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హరీష్, నాగరాజు, కేశవ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈశ్వరీదేవి అమ్మవారి జయంత్యుత్సవాలు

బ్రహ్మంగారిమఠం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారి జయంత్యుత్సవాలు భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహిస్తున్నట్లు మఠాధిపతులు శ్రీవీరశివకుమారస్వామి తెలిపారు. సోమవారం మఠాధిపతులు విలేకర్లతో మాట్లాడుతూ జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారి 322 జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఈ ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో పూజా కార్యక్రమాలకు హాజరవుతున్నారని మఠాధిపతులు పేర్కొన్నారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో కలశస్థాపన, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం జయంతి ఉత్సవాలకు పాల్గొన్న భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి భక్తులందరూ విచ్చేసి తీర్థప్రసాదాలు అందుకోవాలని మఠాధిపతులు తెలిపారు.